ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్

మంగళవారం అక్టోబరు 8, 2024


వందనమమ్మా.. మహాచండీ..


భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన

జన చండిక.. జయ చంద్రిక..


అంతరాలయం ప్రధాన ద్వారానికి పుష్పాలంకరణ




హారతులందుకుంటున్న భక్తులు

- మహాచండీ దర్శనం.. భక్తజన పావనం
- ఐదు రోజుల్లో 3.60 లక్షల మంది రాక
- రేపు దుర్గమ్మను దర్శించుకోనున్న ముఖ్యమంత్రి

ఈనాడు, డిజిటల్ - అమరావతి, న్యూస్‌టుడే - ఇంద్రకీలాద్రి, భవానీపురం, కృష్ణలంక, చిట్టినగర్: ఇంద్రకీలాద్రిపై దసరా సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. ఐదో రోజు సోమవారం శ్రీమహాచండీదేవి రూపంలో దుర్గమ్మ దర్శనమిచ్చింది. తెల్లవారుజామున 4 గంటల నుంచి రాత్రి 11 వరకూ 80 వేల మందికి పైగా భక్తులు మహాచండీదేవిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి క్యూలైన్లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోజంతా సాఫీగా దర్శనాలు సాగిపోయాయి. ఐదు రోజుల ఉత్సవాల్లో మొత్తం 3.60 లక్షల మంది అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ఐదు రోజుల్లో ఆలయానికి ప్రసాదాలు, టిక్కెట్లు, కేశఖండన, ప్రత్యేక పూజలు, చీరల వేలం సహా అన్నింటిపైనా కలిపి రూ.2.50 కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు పట్టువస్త్రాలను సమర్పించనున్నారు. ఇందుకు పోలీసులు, దుర్గగుడి అధికారులు భద్రతా ఏర్పాట్లను చేపడుతున్నారు. బుధవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి ఆలయానికి రానున్నారు. ఐదు రోజుల వేడుకల్లో కనుల పండువగా నగరోత్సవం జరిగింది. పెద్దఎత్తున భక్తులు నగరోత్సవాన్ని తిలకించేందుకు ప్రత్యేకంగా ఇంద్రకీలాద్రికి చేరుకుంటున్నారు. దుర్గాఘాట్‌లో ప్రతిరోజు నదీ హారతి కొనసాగుతోంది. దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు నిత్యం తరలివచ్చి నదీ హారతిని వీక్షిస్తున్నారు.

నేటి అలంకారం
శ్రీ మహాలక్ష్మీ దేవి
నేడు అమ్మవారికి అలంకరించే పట్టు చీర
ఎరుపు రంగు



నేడు మహాలక్ష్మీదేవి రూపం..


★ దుర్గగుడి శరన్నవరాత్రి వేడుకల్లో మంగళవారం దుర్గమ్మ మహాలక్ష్మీదేవి రూపంలో భక్తులకు దర్శనమివ్వనుంది.

దర్శన వేళలు:
ఉదయం 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు...


కొండపై క్యూలైన్లలో భక్తుల రద్దీ


నడవలేని భక్తులను వీల్‌చైర్‌లో దర్శనానికి తీసుకెళుతూ..




కమనీయం.. నగరోత్సవం





కడియం నర్సరీ రైతు ఆధ్వర్యంలో ఉచిత వన ప్రసాద పంపిణీ


కోలాట నృత్యంతో సందడి...


నగరోత్సవంలో మంగళ వాయిద్యకారుల సంకీర్తనాలాపన


ఆది దంపతులకు నృత్యాంజలి

సాంకేతికత తోడుగా... సేవలు మెండుగా!



ఈనాడు - అమరావతి

దుర్గమ్మ దర్శనార్థం లక్షలాదిగా వస్తున్న భక్తుల నియంత్రణకు నగర పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పుష్కలంగా వినియోగిస్తున్నారు. తద్వారా బందోబస్తులో పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు సత్ఫలితాలు సాధిస్తున్నారు. వెరసి ఏటా ఎదురవుతున్న సమస్యలకు చెక్ పెడుతున్నారు. ఆలయ సమీపంలో మోడల్ అతిథి గృహంలో ప్రత్యేకంగా ఉత్సవాల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి.. దర్శన సమయాలు, ట్రాఫిక్ రద్దీ, సీసీ కెమెరాలు, వీఐపీల దర్శనాలు, తదితర అంశాలను ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నారు.

నిరంతరం అప్రమత్తత...

మొత్తం 150 సీసీ కెమెరాలను మోడల్ గెస్ట్ హౌస్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. ఇక్కడ 24 గంటలూ విధుల్లో ఉండే సిబ్బంది. . ఏవైనా సమస్యలు ఎదురైతే.. మైక్ నుంచి పబ్లిక్ అడ్రస్ సిస్టం ద్వారా అన్ని ప్రాంతాలకు సందేశాలు పంపి అక్కడి వారిని అప్రమత్తం చేసే వీలుంది. వీహెచ్ఎఫ్ (వెరీ హై ఫ్రీకెన్సీ) సెట్ ద్వారా ఆయా ప్రాంతాల్లో విధుల్లోని సిబ్బందికి రద్దీ నియంత్రణ, తొక్కిసలాట, ఇతర జాగ్రత్తలపై సూచనలు ఇస్తున్నారు. తప్పిపోయిన చిన్నారుల ఆచూకీ తెలపాలని వారి తల్లిదండ్రులకు కంట్రోల్ రూమ్‌కు వస్తున్నారు. కనిపించకుండా పోయిన ప్రాంతంలో సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన దృశ్యాలు పరిశీలించి. . వారిని పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగిస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు పది మందిని కనుగొని, పెద్దల చెంతకు చేర్చారు.


కంట్రోల్‌రూంలో సీసీ ఫుటేజ్‌ని పర్యవేక్షిస్తున్న కమిషనర్ రాజశేఖర్‌బాబు

ట్రాఫిక్ సమస్యలపై 'అస్త్రం'

నగరంలో కీలక ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా ఉంటోంది. ఉత్సవాలకు రద్దీ సమస్యలు తగ్గించేలా ట్రాఫిక్ పోలీసులకు అక్కరకొచ్చేలా సీపీ రాజశేఖర్‌బాబు.. 'అస్త్రం' అనే మొబైల్ యాప్‌ను తెచ్చారు. దీంతో ఉన్నతాధికారులు ముఖ్య కూడళ్లలో ఏ సమయానికి ఎంత రద్దీ ఉంది? ఎంత దూరం వాహనాలు బారులు తీరాయనేది.. యాప్‌లో పరిశీలించి, ఆ కూడళ్లలో ఒత్తిడి తగ్గించేందుకు పోలీసులకు ఉపయోగపడుతోంది. ప్రత్యామ్నాయ మార్గాల్లో వాహనాల మళ్లింపు, అదనపు సిబ్బందిని పంపి నియంత్రణకు తోడ్పడుతోంది.

యాప్‌తో వీఐపీ దర్శనాల పాస్‌ల జారీ

ఏటా అమ్మవారి దర్శనానికి పోటెత్తే వీఐపీల కారణంగా సామాన్యులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈసారి ఇలాంటి కష్టాలను తప్పించి, నియంత్రించేలా ప్రత్యేక యాప్‌ను పోలీసులు రూపొందించారు. దర్శనానికి వెళ్లే వీఐపీలు ఈ యాప్‌లో నమోదు చేసుకోవాలి. రిజిస్టర్ కాగానే పాస్ రూపంలో క్యూఆర్ కోడ్ వస్తుంది. దీనిని ఆలయం వద్ద స్కాన్ చేసి, దర్శనానికి వెళ్తున్నారు.

దర్శన సమయాల లెక్కింపు..

క్యూ లైన్లలో తొక్కిసలాట నియంత్రణకు, ఎక్కువ సమయం నిరీక్షణ సమయాన్ని తగ్గించేందుకు కూడా శాస్త్రీయ పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నాం. ఉచిత, రూ.100, రూ.300, రూ.500 టిక్కెట్లు తీసుకున్న భక్తులకు అమ్మవారి దర్శనానికి పట్టే సమయాన్ని కచ్చితంగా లెక్కించి.. కంట్రోల్ రూమ్‌కు చేరుస్తున్నారు. దీంతో ఏ సమయానికి వెళ్తే ఎంతసేపటికి దర్శనం అవుతుందనే సమాచారం భక్తులకు ఉపకరిస్తోంది. మూలా నక్షత్రం రోజు భక్తుల అధిక రద్దీకి వీలున్నందున క్యూలైన్లలో కంపార్ట్‌మెంట్లను, ఆ మేరకు బందోబస్తు పెంచబోతున్నారు.

డ్రోన్లతో ప్రత్యక్ష పరిశీలన..




రోజురోజుకు భక్తుల రద్దీ పెరగడంతో.. దానికి తగ్గట్లుగా సిబ్బందిని సిద్ధం చేసేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన డ్రోన్లను వినియోగిస్తున్నారు. ఆలయ పరిసరాల్లో క్యూలైన్లు, ట్రాఫిక్, భక్తుల రద్దీ ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ప్రతి 15 నిమిషాలకోసారి వీటిని ఎగరేస్తున్నారు. తద్వారా వచ్చే దృశ్యాల ఆధారంగా వాస్తవ పరిస్థితులు అంచనా వేసేందుకు బాగా అక్కరకొస్తోంది.

అడగొద్దు.. అడుగేయొద్దు!

ప్రజాప్రతినిధుల మద్యం సిండికేట్ల వ్యవహారం

పలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల జోక్యం

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే బృందం



మద్యం వ్యాపారానికి రాజకీయ నేతలకు విడదీయరాని అనుబంధం. ఇందులో ఎక్కువగా రాజకీయ నేపథ్యం ఉన్న వారే పెత్తనం చెలాయిస్తుంటారు. నూతన మద్యం విధానంలో భాగంగా ఇటీవల ప్రభుత్వం ప్రైవేటు మద్యం దుకాణాలకు దరఖాస్తులను ఆహ్వానించింది. దీంతో చాలా చోట్ల ప్రజాప్రతినిధులు, నేతల చూపు మద్యం దుకాణాలపై పడింది. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కీలక నేతలు దరఖాస్తు చేయకుండా అడ్డుకుంటున్నారు. తామే వ్యాపారం చేయాలనీ, ఇతరులు అడుగుపెట్టకూడదని శాసిస్తున్నారు. పలు చోట్ల సిండికేట్ కడుతున్నారు. దీంతో దరఖాస్తుల రూపంలో ప్రభుత్వానికి జమ కావాల్సిన రాబడికి గండి పడుతోంది. దరఖాస్తులు సమర్పించేందుకు మరో రెండు రోజులే ఉండడంతో ప్రజాప్రతినిధులు తామే దుకాణాలను చేజిక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు.

ఉమ్మడి పెట్టుబడులు.. ఆపై సమాన వాటాలు

విజయవాడ నగరంలో మొత్తం 39 దుకాణాలను ఎక్సైజ్ శాఖ నోటిఫై చేసింది. వీటిని కైవసం చేసుకునేందుకు పలువురు రింగ్ అయి ప్రయత్నిస్తున్నారు. నగరంలోని ఓ నియోజకవర్గానికి చెందిన డివిజన్ స్థాయి ప్రజాప్రతినిధి ఆధ్వర్యంలో ప్రధానమైన సిండికేట్ ఒకటి. మొత్తం 70 మంది సభ్యులు ఈ సిండికేట్‌లో ఉన్నారు. నగరంలోని 39 దుకాణాలకు వీరు టెండర్లు వేయాలని నిర్ణయించారు. సిండికేట్‌లోని ఐదుగురు కలిసి ఒక్కో దుకాణానికి వేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఇంకా ఎవరైనా తమతో వస్తే.. చేర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. వీరిలో ఎవరికి దుకాణం వచ్చినా.. అందరూ కలసి పెట్టుబడులు పెట్టి సమాన వాటాలు తీసుకునేలా అవగాహనకు వచ్చారు.

రెండు జిల్లాల్లో మద్యం దుకాణాలు, ఇప్పటి వరకు దరఖాస్తులు
(సోమవారం రాత్రి 9 గంటల వరకు..)

జిల్లా	దుకాణాలు	దరఖాస్తులు
ఎన్టీఆర్	113	1,565
కృష్ణా	123	545

ఒక దుకాణం.. 10 మంది బినామీలు..

మరో నియోజకవర్గంలో మాజీ కార్పొరేటర్ ఒకరు ఒక దుకాణానికి దరఖాస్తు చేస్తున్నారు. ఇందుకు 10 మంది బినామీలను సిద్ధం చేశారు. వీరితో దరఖాస్తులు చేయిస్తున్నారు. ఎవరికి వచ్చినా ఈ నేత వ్యాపారం నిర్వహించేలా ఒప్పందం చేసుకున్నారు. పెట్టుబడీ ఇతనే సమకూరుస్తున్నారు. నగరంలో మరో కీలకమైన సిండికేట్ ఇప్పటికే బార్లను నడుపుతోంది. ఇందులో సభ్యులు కొందరితో జట్టు కట్టి షాపులు దక్కించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. విజయవాడలో విపరీతమైన పోటీ ఉంది. ప్రధానంగా కృష్ణలంక, పాయకాపురం, న్యూ రాజరాజేశ్వరీపేట, అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతాల్లోని దుకాణాలకు విపరీతమైన డిమాండ్ ఉంది.

ఇటు రావద్దని హెచ్చరికలు

- **ఉయ్యూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని** మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్న వారికి ఓ కీలక నేత అనుచరులు ఫోన్లు చేసి బెదిరిస్తున్నారు. తమకు చెప్పకుండా దరఖాస్తులు దాఖలు చేయవద్దని హుకుం జారీ చేస్తున్నారు. ఆ నేత తాలూకు వారు మాత్రమే మద్యం దుకాణాలు పొందేలా సిండికేట్ అవుతున్నట్లు సమాచారం.
- **గుడివాడలో** ఓ నేత తమ అనుచరులకు దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నట్లు తెలిసింది. దీంతో వారు ఒక్కటై దరఖాస్తులు పెట్టుకుంటున్నట్లు సమాచారం.
- **గన్నవరం పరిధిలో** 29 దుకాణాలకు నామమాత్రంగానే దరఖాస్తులు వచ్చాయి. ఎవరినీ దరఖాస్తు చేయొద్దని కీలక నేత వర్గీయులు ఇప్పటికే ఔత్సాహికులకు గట్టిగా చెప్పారు. తాము గతంలోనూ ఇదే వ్యాపారం చేసే వారమని మొత్తుకున్నా వేయడానికి వీల్లేదని ఖరాకండిగా చెప్పేశారు. గన్నవరం ఎక్సైజ్ కార్యాలయంలో మకాం వేసి.. బయటి వ్యక్తులు దరఖాస్తులు సమర్పించకుండా పహారా ఏర్పాటు చేయడం గమనార్హం. దరఖాస్తు చేసేందుకు కొందరు సోమవారం వెళ్లగా వీరు అడ్డగించారు. వెనక్కు వెళ్లిపోవాలని రుబాబు చేశారు. చివరకు.. ఆ కీలక నేత సన్నిహితుల్లో ఒకరికి ఫోన్ చేయగా, దరఖాస్తు చేయడానికి అనుమతించారు. తాము చెప్పిన విధంగా నడుచుకోవాలని హుకుం జారీ చేసినట్లు సమాచారం.
- **పెడన పురపాలిక పరిధిలో** సోమవారం సాయంత్రం వరకూ ఒక దుకాణానికి దరఖాస్తులు రాలేదు.
- కృత్తివెన్ను మండలంలో 3, అవనిగడ్డలో 1, నందివాడలో 3, గుడివాడ పట్టణంలో 1, పామర్రులో 1, బాపులపాడులో 3 దుకాణాలకు దరఖాస్తులు రాలేదు.

మద్యం దుకాణాల లైసెన్స్‌కు భారీ స్పందన

ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా 1100 దరఖాస్తులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: మద్యం దుకాణాల లైసెన్స్‌లకు భారీ స్పందన వస్తోందని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాసరావు అన్నారు. గన్నవరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను సోమవారం ఆయన పరిశీలించారు. స్టేషన్ పరిధిలో వచ్చిన దరఖాస్తులు, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీఐ డి.సురేఖతో కలిసి డీసీ శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో మొత్తం 236 మద్యం దుకాణాలకు ఇప్పటి వరకు 1100కు పైగా దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. గన్నవరం ఎక్సైజ్ పరిధిలో 23 దుకాణాలకు 35 దరఖాస్తులు వచ్చాయన్నారు. 9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరణ, 11న తేదీ మచిలీపట్నం, విజయవాడలో లాటరీ పద్ధతిలో లైసెన్స్‌లు మంజూరు చేయనున్నట్లు వివరించారు. సిండికేట్లకు తావులేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. స్టేషన్ వద్ద సోమవారం కొందరు దరఖాస్తుదారులను అడ్డుకుంటున్నారని సమాచారం రాగానే పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ కన్వీనర్ కోటాకు ఫ్రీఎగ్జిట్ ఆప్షన్

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: ప్రస్తుత విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో మొదటి, రెండో విడత కన్వీనర్ కోటా ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు విజయవాడ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఫ్రీ ఎగ్జిట్ ఆప్షన్ ఇచ్చింది. ఆల్ ఇండియా కోటా, ఇతర రాష్ట్రాల్లో మెరుగైన కళాశాలల్లో వెళ్లేందుకు విశ్వవిద్యాలయం ఈ వెసులుబాటు ఇచ్చింది. ఈనెల 14వ తేదీ మధ్యాహ్నం 3గంటలల్లోగా బయటకు వెళుతున్నట్లు ఆప్షన్ ఇస్తే ఆ సీట్లను మూడో విడత కౌన్సెలింగ్‌లో భర్తీ చేయనున్నారు. ఈ మేరకు ఫ్రీ ఎగ్జిట్ దరఖాస్తు పత్రాన్ని విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో పొందుపర్చారు.

అమ్మవారి బందోబస్తుకు వచ్చి జూదం

హోటల్ గదిలో సీఐలు ఆడుతున్న దృశ్యాలు వైరల్

విచారణకు ఆదేశించిన విజయవాడ పోలీస్ కమిషనర్

ఈనాడు - అమరావతి

జూద శిబిరాలపై దాడి చేసి ఆడే వారిపై కేసులు నమోదు చేయాల్సిన పోలీసులే కట్టు తప్పారు. వారే జూదం ఆడుతున్న దృశ్యాలు సోమవారం సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అవుతున్నాయి. అది కూడా.. దుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలకు బందోబస్తు విధుల నిమిత్తం విజయవాడ వచ్చి జూదం ఆడడం పై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆ బృందంలో ఒకరు రహస్యంగా వీడియో తీసి సోషల్ మీడియాలో ఉంచినట్లు భావిస్తున్నారు. ఈ దృశ్యాల ఆధారంగా ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు.





జూదం ఆడుతున్న పోలీసులు

హోటల్ గదిలోనే సెటప్...

అమ్మవారి నవరాత్రి ఉత్సవాలకు బందోబస్తు కోసం వివిధ జిల్లాల నుంచి పోలీసు అధికారులు, సిబ్బంది విజయవాడ వచ్చారు. వారి హోదాలను బట్టి బస ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఓ హోటల్ గదిలో పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ సీఐ రాయుడు విజయకుమార్, ఏలూరు రేంజిలో వీఆర్‌లో ఉన్న ఇన్‌స్పెక్టర్ రఘు, విజయవాడ రెండో పట్టణ సీఐ కొండలరావు, సైబర్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీను, అతని స్నేహితుడు హోటల్ గదిలో కలిశారు. వీరంతా ఒకే బ్యాచ్‌కు చెందిన వారు కావడంతో విధులు ముగిసిన తర్వాత సరదాగా జూదం ఆడారు. ఆడే సమయంలోనే వీరిలో ఒకరు రహస్యంగా వీడియో తీశారు. అనంతరం ఆ దృశ్యాలు వాట్సాప్‌తో పాటు వివిధ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఆ వీడియోలో ఇన్‌స్పెక్టర్లు రాయుడు విజయకుమార్, కొండలరావు, శ్రీను, అతని స్నేహితుడు జూదం ఆడుతున్నట్లు ఉంది.

మూడు రోజుల్లో నివేదిక...

అమ్మవారి బందోబస్తు విధులకు వచ్చిన సీఐలు జూదం ఆడుతున్న దృశ్యాలు విజయవాడ పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు దృష్టికి వచ్చాయి. దీనిపై విచారణ జరిపేందుకు ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రసన్నకుమార్‌ను నియమించారు. ఈ ఉదంతంపై దర్యాప్తు చేసి, మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని సీపీ ఆదేశాలు జారీ చేశారు. ఆ నివేదిక ఆధారంగా సీఐలపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం



ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న పి.ఎస్. మునిరత్నం

విజయవాడ బస్‌స్టేషన్, న్యూస్‌టుడే : ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌గా పి.ఎస్. మునిరత్నం సోమవారం ఉదయం ఆర్టీసీ హౌస్‌లోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ముఖ్యమంత్రి ఆదేశాలతో త్వరలో అమలు చేస్తామన్నారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతాలకు సైతం బస్సులు నడుపుతున్న ఘనత ఆర్టీసీకే దక్కుతుందన్నారు. ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో సంస్థను లాభాల బాటలో తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

గౌరంగబాబు మృతి తెదేపాకు తీరని లోటు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం మాజీ పాలక మండలి ఛైర్మన్, తెదేపా సీనియర్ నేత యలమంచిలి గౌరంగబాబు మృతి పార్టీకి తీరని లోటు అని నాయకులు అన్నారు. విజయవాడ భారతీనగర్ లోని తన నివాసంలో సోమవారం ఉదయం ఆయన కన్నుమూశారు. తెదేపా ఆవిర్భావం నుంచి ఆయన క్రియాశీలకంగా పనిచేశారు. అర్బన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఉన్న ఆయనకు 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత దుర్గామల్లేశ్వర దేవస్థానం ఛైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారు. తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు.. గౌరంగబాబు నివాసానికి వచ్చి సంతాపం తెలిపారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. మంగళవారం ఉదయం ఆయన అంతిమయాత్ర భారతీనగర్ నుంచి సాగనుంది. తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.వి.బి.రాజేంద్రప్రసాద్, కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, చెన్నుపాటి గాంధీ, తూమాటి ప్రేమ్‌నాథ్ తదితరులు సంతాపం తెలిపారు.



నివాళులర్పిస్తున్న దేవినేని ఉమా తదితరులు

గౌరంగబాబు (పాత చిత్రం)

సీఎం చంద్రబాబు సంతాపం

ఈనాడు, అమరావతి : తెదేపా సీనియర్‌నేత యలమంచిలి గౌరంగబాబు మృతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సంతాపం తెలిపారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ఆయన విశేష కృషి చేశారని కొనియాడారు. గౌరంగబాబు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

అక్రమంగా తరలిస్తున్న గోవుల స్వాధీనం

గంపలగూడెం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లా నుంచి తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ సమీపంలోని ఇబ్రహీంపట్నానికి అక్రమంగా తరలిస్తున్న 150 గోవులను గంపలగూడెం పోలీసులు ఆదివారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీసులు వరుసగా రెండో రోజు కూడా వాహనాల తనిఖీ ద్వారా గోవుల అక్రమ రవాణాకు చెక్ పెట్టారు. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం పెనుగొలను వద్ద శనివారం అర్ధరాత్రి లారీలో తరలిస్తున్న 50 ఆవులను స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. వాటిని భద్రత కోసం ప్రస్తుతం నెమలి వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఉంచారు. తాజాగా ఆదివారం రాత్రి మరో మూడు లారీల్లో అక్రమంగా తరలిస్తున్న 150 ఆవులను నెమలి గ్రామం వద్ద స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ఎస్.శ్రీను తెలిపిన వివరాల మేరకు నెమలిలో ఆదివారం రాత్రి గ్రామస్థులు బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తుండగా వరుసగా మూడు లారీలు రావడంతో అనుమానంతో ఆపి విచారించారు. వాటిలో గోవులు ఉండడం గమనించి వెంటనే గంపలగూడెం పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఎస్సై శ్రీను తన సిబ్బందితో అక్కడికి వెళ్లి ఆవులు, 3 లారీలను స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవర్లను విచారించగా శ్రీకాకుళం నుంచి హైదరాబాద్ సమీప ఇబ్రహీంపట్నం తరలిస్తున్నట్లు బదులిచ్చారు. తదుపరి ఆవులను రాజధాని అమరావతి సమీప తుళ్లూరు మండలం అనంతవరం వద్ద ఉన్న గోశాలకు సోమవారం తరలించామన్నారు. నెమలికి చెందిన జోనబోయిన వెంకటకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోమాతల అక్రమ రవాణాపై సోమవారం ఉదయం కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. లారీ డ్రైవర్లైన తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా మంచాల్‌కు చెందిన రామవత్ మోహన్, మాడుగులకు చెందిన రట్లావత్ శంకర్, వెల్దనందంకు చెందిన కొర్ర సురేష్‌ను అరెస్టు చేశామన్నారు. మూడు లారీలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని పేర్కొన్నారు.



లారీలో తాళ్లతో బంధించారిలా

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

క్రీడా జట్ల ఎంపికలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఉమ్మడి కృష్ణా జిల్లా అండర్-19 రోలర్ స్కేటింగ్, రైఫిల్ షూటింగ్ బాలబాలికల జట్ల ఎంపిక పోటీలను ఈ నెల 8వ తేదీన జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహిస్తామని ఆ సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి వి.రవికాంత తెలిపారు. భవానీపురం హెచ్‌బీ కాలనీలోని స్కేటింగ్ రింక్‌లో రింక్ రేస్, రోడ్ రేస్ జిల్లా జట్ల ఎంపికలు ఉంటాయన్నారు. తాడిగడపలోని ది ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్‌లో రైఫిల్ షూటింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఆసక్తిగల క్రీడాకారులు ఫోన్ 94401 12455 నంబరుకు సంప్రదించాలన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము, జిల్లాస్థాయి ఇసుక కమిటీ, ఎన్టీఆర్ జిల్లా

సీల్డ్ టెండర్స్ ఆహ్వానిస్తూ సంక్షిప్త పత్రికా ప్రకటన

బిడ్ నోటీసు నం: 831/ఇసుక/2024 తేది: 07-10-2024

జిల్లా స్థాయి ఇసుక కమిటీ, ఎన్టీఆర్ జిల్లా వారు ఈ క్రింది పేర్కొనబడిన ఇసుక రీచ్‌లనందు మనుషులతో త్రవ్వకము చేసి నిల్వ కేంద్రం వద్దకు ట్రాక్టర్లు ద్వారా రవాణా చేసి మరియు నిల్వ కేంద్రం వద్ద వినియోగదారుల వాహనాల్లో లోడ్ చేయుట కొరకు సీల్డ్ టెండర్ ఆహ్వానించబడుచున్నవి. బేస్ ప్రైస్‌ను ఒక మెట్రిక్ టన్నుకు 110/- రూపాయలుగా నిర్ణయించడమైనది. సీల్డ్ టెండర్లను జిల్లా గనులు మరియు భూగర్భ శాఖవారి కార్యాలయం, ఎన్టీఆర్ జిల్లాయందు 11-10-2024వ తేదీ ఉదయం 09 గంటల వరకు స్వీకరించబడును.

వరుస సంఖ్య	రీచ్ పేరు	మండలం	విస్తీర్ణం హెక్టార్‌లో	ఇసుక పరిమాణము మెట్రిక్ టన్నులులో	జియో కోఆర్డినేట్స్
1	ఇందుపల్లి-1	వత్సవాయి	4.93	73,950	N16°58'59.01" E80°11'13.31" N16°59'01.66" E80°11'18.63" N16°58'54.06" E80°11'23.95" N16°58'51.46" E80°11'18.87"
2	అల్లూరుపాడు-1	వత్సవాయి	4.98	74,700	N16°56'20.73" E80°13'34.58" N16°56'24.17" E80°13'40.23" N16°56'22.33" E80°13'44.67" N16°56'14.60" E80°13'40.39"
3	పెండ్యాల-1	కంచికచర్ల	4.94	74,100	N16°41'20.07" E80°018'05.46" N16°41'15.37" E80°18'13.30" N16°41'10.61" E80°18'08.83" N16°41'12.43" E80°18'02.93"
4	పెండ్యాల-2	కంచికచర్ల	4.89	73,350	N16°41'44.55" E80°18'18.05" N16°41'42.30" E80°18'23.06" N16°41'34.50" E80°18'19.32" N16°41'35.75" E80°18'13.25"
5	వేములపల్లి-1	కంచికచర్ల	4.97	74,550	N16°39'45.42" E80°17'48.17" N16°39'47.65" E80°17'55.26" N16°39'40.97" E80°17'57.69" N16°39'37.62" E80°17'52.09"
6	వేములపల్లి-2	కంచికచర్ల	4.95	74,250	N16°40'24.78" E80°17'51.35" N16°40'25.85" E80°17'57.25" N16°40'16.53" E80°17'58.53" N16°40'16.14" E80°17'52.61"
7	పోక్కునూరు-1	చందర్లపాడు	4.88	73,200	N16°38'55.48" E80°09'13.20" N16°39'01.44" E80°09'14.80" N16°38'56.68" E80°09'23.43" N16°38'51.85" E80°09'21.83"
8	పోక్కునూరు-3	చందర్లపాడు	4.98	74,700	N16°38'36.45" E80°10'17.52" N16°38'41.21" E80°10'08.37" N16°38'46.27" E80°10'09.78" N16°38'41.52" E80°10'19.19"
9	ఉస్తేపల్లి-1	చందర్లపాడు	4.98	74,700	N16°41'44.98" E80°08'48.69" N16°41'45.77" E80°0855.29" N16°41'38.35" E80°08'57.46" N16°41'37.43" E80°08'49.90"
10	కసరాబాద-2	చందర్లపాడు	4.98	74,700	N16°40'55.56" E80°08'47.99" N16°40'55.32" E80°08'59.48" N16°40'50.42" E80°08'59.49" N16°40'50.93" E80°08'48.31"
11	ఏటూరు-1	చందర్లపాడు	4.93	73,950	N16°36'46.68" E80°19'37.26" N16°36'47.18" E80°19'43.15" N16°36'37.93" E80°19'44.10" N16°36'37.41" E80°19'38.49"
12	వెంగనాయకునిపాలెం-1	పెనుగంచిప్రోలు	4.52	67,800	N16°50'17.40" E80°17'05.51" N16°50'19.74" E80°17'09.39" N16°50'09.04" E80°17'13.34" N16°50'07.21" E80°17'09.29"
13	శెనగపాడు-1	పెనుగంచిప్రోలు	4.91	73,650	N16°49'01.14" E80°17'38.82" N16°49'02.96" E80°17'46.18" N16°48'55.69" E80°17'48.30" N16°48'54.64" E80°17'41.03"
14	పెనుగంచిప్రోలు-2	పెనుగంచిప్రోలు	4.97	74,550	N16°53'33.49" E80°16'01.48" N16°53'36.80" E80°16'05.20" N16°53'28.91" E80°16'12.61" N16°53'25.26" E80°16'09.48"
15	పెనుగంచిప్రోలు-1	పెనుగంచిప్రోలు	4.95	74,250	N16°52'05.94" E80°16'28.28" N16°52'05.30" E80°16'34.42" N16°51'56.64" E80°16'34.64" N16°51'56.35" E80°16'28.96"

నోట్: 1. అర్హత ప్రమాణాలతో, ఇ.సి.వి., ఇయండి, పియస్‌డి మొదలగు వివరములతో కూడిన బిడ్ డాక్యుమెంట్ జిల్లా గనులు మరియు భూగర్భ శాఖ వారి కార్యాలయం, హౌస్.నం: 54-19-22/5A, 2nd ఫ్లోర్, జయప్రకాశ్ నగర్, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా-520008 వారి నుండి టెండర్ డాక్యుమెంట్ ఫీజు Rs. 10,000/- ఏదయినా జాతీయ బ్యాంకు నందు డిస్ట్రిక్ట్ సాండు ఎకౌంటు 2024, ఎన్టీఆర్ పేరుమీద డిమాండ్ డ్రాఫ్ట్ రూపములో చెల్లించి పొందగలరు. 2. బిడ్ డాక్యుమెంట్‌ను 08-10-2024 నుండి 11-10-2024 ఉదయం 08.00 వరకు పొందగలరు. 3. బిడ్ డాక్యుమెంట్ స్వీకరించబడు చివరి తేది 11-10-2024 ఉదయం 09.00 వరకు.

Place : విజయవాడ, Date : 07-10-2024 Sd/- జిల్లా కలెక్టర్ మరియు ఛైర్మన్, జిల్లా స్థాయి ఇసుక కమిటీ, ఎన్టీఆర్ జిల్లా

రాష్ట్ర స్థాయి అత్యా-పాత్యాలో సత్తా

విజయవాడ క్రీడలు: నెల్లూరు జిల్లా నవాబ్‌పేటలో ఈ నెల 5, 6వ తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్(అండర్-14) బాలబాలికల అత్యా-పాత్యా ఛాంపియన్‌షిప్‌లో జిల్లా బాలుర జట్టు రన్నరప్ ట్రోఫీ కైవసం చేసుకుందని జిల్లా అత్యా-పాత్యా సంఘం కార్యదర్శి ఆర్.శ్రీరవి తెలిపారు. ట్రోఫీ సాధించిన సభ్యులను సంఘం సీఈవో ఆర్టీ ప్రసాద్, జిల్లా జట్టుకు శిక్షణ శిబిరం నిర్వహించిన క్రైస్ట్ ది కింగ్ స్కూల్ ప్రధానోపాధ్యాయిని సిస్టర్ మేరీ లిల్లీ జోస్సిన్ అభినందించారు.

జగ్గయ్యపేట పురపాలక సంఘం

హెచ్చరిక

పట్టణ ప్రజలకు తెలియచేయునది ఏమనగా ఈ క్రింది జాబితాలో పొందుపరచిన స్థలములు / ప్లాట్లు నందు ఎటువంటి అనుమతులు లేకుండా అనధికారముగా లే-అవుట్లు వేసియున్నారు.

క్ర. సం.	మండలం పేరు	రెవెన్యూ గ్రామము	ఆర్ఎస్ నెంబరు	ఎక్స్‌టెంట్ (ఎసి)
1	జగ్గయ్యపేట	జగ్గయ్యపేట	222-1	1.5
2	జగ్గయ్యపేట	జగ్గయ్యపేట	222-4B	4.02
3	జగ్గయ్యపేట	జగ్గయ్యపేట	524.5	4.02
4	జగ్గయ్యపేట	జగ్గయ్యపేట	424.3	1.02
5	జగ్గయ్యపేట	జగ్గయ్యపేట	227/7G,7H	0.99
6	జగ్గయ్యపేట	జగ్గయ్యపేట	227/7D,7F	1.17
7	జగ్గయ్యపేట	జగ్గయ్యపేట	260/2A	0.9
8	జగ్గయ్యపేట	జగ్గయ్యపేట	258/3	0.63
9	జగ్గయ్యపేట	జగ్గయ్యపేట	227/6B	2
10	జగ్గయ్యపేట	జగ్గయ్యపేట	245-3	9.2
11	జగ్గయ్యపేట	జగ్గయ్యపేట	44/10,44/11	2.4
12	జగ్గయ్యపేట	జగ్గయ్యపేట	190/1,192/2,192/3	2.2
13	జగ్గయ్యపేట	తొర్రగుంటపాలెం	43(P)	3.2
14	జగ్గయ్యపేట	తొర్రగుంటపాలెం	42	1.5
15	జగ్గయ్యపేట	తొర్రగుంటపాలెం	8P	1.78
16	జగ్గయ్యపేట	తొర్రగుంటపాలెం	14/1	3
17	జగ్గయ్యపేట	తొర్రగుంటపాలెం	46/1B 1B	2
18	జగ్గయ్యపేట	జగ్గయ్యపేట	100/1A, 1B&401/(P)	-
19	జగ్గయ్యపేట	జగ్గయ్యపేట	113/1B	3.11
20	జగ్గయ్యపేట	జగ్గయ్యపేట	89P	4.58
21	జగ్గయ్యపేట	జగ్గయ్యపేట	169/2A	8.25
22	జగ్గయ్యపేట	జగ్గయ్యపేట	180/3	1
23	జగ్గయ్యపేట	జగ్గయ్యపేట	382/2A	2.09
24	జగ్గయ్యపేట	జగ్గయ్యపేట	109/2C	1.99
25	జగ్గయ్యపేట	జగ్గయ్యపేట	165/2C, 2D	2.5
26	జగ్గయ్యపేట	జగ్గయ్యపేట	58/1A,1B	4.44
27	జగ్గయ్యపేట	జగ్గయ్యపేట	370(P)	7.04
28	జగ్గయ్యపేట	జగ్గయ్యపేట	153(P)	1.48
29	జగ్గయ్యపేట	జగ్గయ్యపేట	153(P)	3.06
30	జగ్గయ్యపేట	జగ్గయ్యపేట	33,34,35,36,37&38	20.16
31	జగ్గయ్యపేట	జగ్గయ్యపేట	155/1A2	0.73
32	జగ్గయ్యపేట	జగ్గయ్యపేట	338	1.68
33	జగ్గయ్యపేట	జగ్గయ్యపేట	183,184	2.4
34	జగ్గయ్యపేట	జగ్గయ్యపేట	165(P)	1.1
35	జగ్గయ్యపేట	జగ్గయ్యపేట	103(P), 104(P)	1.5
36	జగ్గయ్యపేట	జగ్గయ్యపేట	279/1, 282/1, 283	5.5
37	జగ్గయ్యపేట	తొర్రగుంటపాలెం	21	20.5
38	జగ్గయ్యపేట	తొర్రగుంటపాలెం	28(P)	8.55
39	జగ్గయ్యపేట	తొర్రగుంటపాలెం	18	11.2
40	జగ్గయ్యపేట	తొర్రగుంటపాలెం	17	3.19
41	జగ్గయ్యపేట	తొర్రగుంటపాలెం	26	7.8
42	జగ్గయ్యపేట	తొర్రగుంటపాలెం	40(P)	7.66
43	జగ్గయ్యపేట	తొర్రగుంటపాలెం	41(P)	8.81

కావున పైన తెలియపరిచిన లే-అవుట్లు నందు స్థలము లేక ప్లాట్లు కొనుగోలు చేయుట చట్ట విరుద్ధము మరియు ఈ ప్లాట్లు అమ్మకము, కొనుగోలు వీలు లేకుండా రిజిస్ట్రేషన్ చేయబడవు మరియు మౌలిక వసతులు అనగా రోడ్లు, కరెంటు, నీరు, డ్రైనులు సదుపాయాలు కల్పించబడవు, కావున దీనిని పట్టణ ప్రజలందరూ గమనించవలసినదిగా విజ్ఞప్తి.
గమనిక : అనధికారముగా లేఅవుట్లు వేసి మరియు అమ్మకాలు చేయుచున్న స్థల యజమానుల లేదా డెవలపర్ల పైన చట్టపరమైన చర్యలు తీసుకొనబడును.

ఇట్లు, సం/- కమిషనర్
జగ్గయ్యపేట పురపాలక సంఘం

సత్యమ్మతల్లికి పట్టు వస్త్రాల సమర్పణ



ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని అంబారుపేట సత్యమ్మతల్లికి సోమవారం మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, శిరీష దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. లలితాత్రిపుర సుందరిగా దర్శనమిచ్చిన అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు మంచాల మాధవ్, చుండు వాసు, ఈవో హరి గోపీనాథ్ అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. అర్చకులు నందిగామ వెంకట సుబ్బారావు, సూరేపల్లి వీరభద్రయ్య శర్మ ఆశీర్వచనం ఇచ్చారు.

వరద బాధితులను ఆదుకోవడం అభినందనీయం

గొల్లపూడి: వరద బాధితులను స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల నాయకులు ఆదుకోవడం అభినందనీయమని మైలవరం ఎమ్మెల్యే వసంతకృష్ణప్రసాద్ పేర్కొన్నారు. సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో సేకరించిన బియ్యాన్ని కొత్తూరుతాడేపల్లి, వేమవరం, గన్నవరం నియోజకవర్గంలోని అంబాపురం, పాతపాడు, పి.నైనవరం గ్రామాల్లోని వరద బాధితులకు సోమవారం రాత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ వరద కారణంగా నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు పల్లె రఘునాథ్‌రెడ్డి ముందుకు రావడం సంతోషకరమని, రూ.43లక్షల విలువైన 71 టన్నుల బియ్యాన్ని పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆర్డీవో బాధ్యతల స్వీకరణ



నిత్యావసర వస్తువుల నిల్వపై తనిఖీ చేస్తున్న ఆర్డీవో మాధురి

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారిగా కడలి మాధురి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల శిక్షణ పూర్తి చేసుకున్న ఈమెను తిరువూరు ఆర్డీవోగా ప్రభుత్వం నియమించింది. ఆమెకు కార్యాలయ ఉద్యోగులు స్వాగతం పలికారు. అనంతరం ఆమె చౌక దుకాణాలకు సరఫరా చేసే నిత్యావసర వస్తువుల మండల స్థాయి నిల్వ కేంద్రంలో(ఎంఎల్ఎస్ పాయింట్) తిరువూరు ఆర్డీవో కె.మాధురి సోమవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌ఛార్జి జి.నాగమణి, సీనియర్ సహాయకుడు కె.రవికుమార్, సిబ్బంది ఆమె వెంట ఉన్నారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.దేవదత్ ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన కొత్తా మాధవి అమలాపురం బదిలీ అయ్యారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

పరిమితికి మించి ఎక్కించొద్దు



ఆటో డ్రైవర్‌కు సూచనలిస్తున్న సీఐ చంద్రశేఖర్

మైలవరం, న్యూస్‌టుడే: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించి ప్రయాణాలు సాగించడం క్షేమం కాదని సీఐ చంద్రశేఖర్ సూచించారు. సోమవారం అధిక ప్రయాణికులతో వెళ్తున్న పలు ఆటోలను నిలిపి డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. నిబంధనలు ఉల్లంఘించి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దుర్గమ్మా.. నిను చూసి తరించాం

- అమ్మను దర్శించుకున్న భక్తుల ఆనందం
- రాష్ట్రాలు దాటి తరలి వస్తున్న ప్రజలు
- ప్రభుత్వ ఏర్పాట్లు బాగున్నాయంటూ కితాబు

గొల్లపూడి, న్యూస్‌టుడే

ఇంద్రకీలాద్రిపై ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు దూరప్రాంతాల నుంచో భక్తులు తరలివస్తున్నారు. దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రభుత్వం చేసిన ఏర్పాట్లపై వచ్చిన భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలు, రాష్ట్రాలు దాటి పెద్ద సంఖ్యలో ఇంద్రకీలాద్రికి చేరుకుంటున్నారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రం నుంచి ఎక్కువ మంది వస్తున్నారు. కార్లు, బస్సులు, ఇతర వాహనాల్లో అమ్మ దర్శనం కోసం వరుస కడుతున్నారు. ఆ వాహనాలను పున్నమి, భవానీ స్నానఘాట్‌ల వద్ద ఉంచి ఇంద్రకీలాద్రిపై అఖిలాండేశ్వరిని దర్శించుకునేందుకు పరుగులు పెడుతున్నారు. కొండకు వచ్చే వాహనాలతో విజయవాడ-హైదరాబాద్ రహదారి రద్దీగా మారుతోంది. ఎక్కడా లోటుపాట్లు లేకుండా చక్కటి ఏర్పాట్లు చేశారని ఆనందోత్సాహాలు వెలిబుచ్చుతున్నారు. తెలంగాణ నుంచి వచ్చిన భక్తులు 'న్యూస్‌టుడే' పలకరించగా వారి అభిప్రాయాలను ఒక్కసారి వారి మాటల్లోనే పరిశీలిద్దాం..



గొల్లపూడి వద్ద రద్దీగా జాతీయ రహదారి

ప్రశాంతంగా దర్శించుకున్నాం



ఇంద్రకీలాద్రిపై దసరా కళ ఉట్టిపడుతోంది. ఏర్పాట్లన్నీ చక్కగా చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అర్థమయ్యే రీతిలో నోటీసు బోర్డులు పెట్టారు. ముఖ్యంగా పరిశుభ్రతపై ఎక్కువగా దృష్టి సారించడంతో ఎక్కడా చెత్త, వ్యర్థాలు కనిపించడంలేదు. ఉత్సవాలు ఈ స్థాయిలో ఉంటాయని ఊహించలేదు. పున్నమి ఘాట్ వద్ద వాహనాలను పార్కింగ్ చేసుకుని దర్శనం చేసుకుని తిరిగి వచ్చాం. ఎక్కడికక్కడ తాగునీటి బాటిళ్లు అందించడం, క్లోక్‌రూం, చెప్పుల స్టాండ్లు, హెల్ప్ డెస్క్, అత్యవసర ప్రథమ చికిత్సా కేంద్రాలు ఇలా... వివిధ రకాల సౌకర్యాలు భక్తుల కోసం కల్పించారు. అమ్మను ప్రశాంతంగా దర్శించుకున్నాం.. **- శ్రీలత, పద్మ(హైదరాబాద్)**

అవగాహన కల్పిస్తే ఇంకా బాగుంటుంది



కొండపై దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా క్యూలైన్లు, వాహనాల పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. క్రమపద్ధతిలో వాహనాలను పంపుతున్నారు. అయితే...దసరా ఏర్పాట్లకు సంబంధించి కొందరు పోలీసులకు అవగాహన కల్పిస్తే బాగుంటుంది. పార్కింగ్, దర్శనం, ఇతర ఏర్పాట్లకు సంబంధించి పోలీసులను అడిగితే తెలియదని చెబుతున్నారు, దీంతో కొంత ఇబ్బందిగా ఉంటుంది. ముఖ్యమైన కూడళ్లలో ఉండే పోలీసులకు అవగాహన కల్పిస్తే ఎక్కువ మంది భక్తులకు సౌకర్యంగా ఉంటుంది. **- సాయి, అఖిల్, లోకేష్(హైదరాబాద్)**

త్రిశక్తి రూపిణి.. శ్రీ మహాచండీ దర్శిని



గంపలగూడెం రామాలయం వీధిలో..



గంపలగూడెంలో బతుకమ్మ సంబరాల్లో మహిళలు



రెడ్డిగూడెం: రాఘవాపురంలో



జి.కొండూరు బీసీ కాలనీలో..



ఇబ్రహీంపట్నం గ్రామీణం కోటికలపూడిలో



మైలవరం రేణుకమ్మ ఆలయంలో నిమ్మకాయలతో అలంకరణ



ఎ.కొండూరు : పాత రేపూడి బీసీ కాలనీలో..



మైలవరంలో మహాచండీ అలంకరణలో పూజలందుకుంటున్న అమ్మవారు

తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఐదో రోజైన సోమవారం జగన్మాత ప్రతిమలను శ్రీ మహా చండి దేవీగా అలంకరించారు. స్థానిక మహిళలు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కమిటీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుంకుమ పూజల్లో అధిక సంఖ్యల్లో మహిళలు పాల్గొన్నారు. నిర్వాహకులు ప్రసాదాలు పంపిణీ చేశారు. పలు చోట్ల చిన్నారులు, యువతులు మహిళలు బతుకమ్మ పేర్చి కోలాటమాడారు. **- న్యూస్‌టుడే బృందం**



గంపలగూడెం : ఆర్లపాడులో..



విస్సన్నపేట కలగరలో..



విస్సన్నపేట : పుట్రేల మారెమ్మ గుడిలో..



ఎన్టీపీఎస్ అభయ సాయి మందిరంలో



గంపలగూడెం : పెనుగొలనులో..



గంపలగూడెం కాపులవారి వీధిలో



ఎ.కొండూరు : చీమలపాడులో



గంపలగూడెం : పెనుగొలను శివాలయంలో

బడుల్లో ఆయాలను తొలగించకండి



డీఈవో సుబ్బారావుకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో ఆయాలుగా పనిచేస్తున్న సిబ్బందిని తొలగించవద్దని కోరుతూ జిల్లా విద్యా శాఖాధికారి యూవీ. సుబ్బారావుకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేసినట్లు విస్సన్నపేటకు చెందిన ఆయాల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.త్యాగరాజు తెలిపారు. విస్సన్నపేట, గంపలగూడెం, రెడ్డిగూడెం తదితర మండలాల్లోని బడుల్లో కొత్తగా వచ్చిన ఎస్ఎంసీల ఆధ్వర్యంలో ఎప్పటి నుంచో పనిచేస్తున్న ఆయాలను తొలగిస్తున్నారని తెలిపారు. ఇందుకు ఎంఈవోలు సహకరిస్తున్నారని డీఈవోకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి తగు చర్యలు తీసుకుంటామని డీఈవో హామీ ఇచ్చినట్లు ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు.

వాన కురవాలని పూజలు



వానలు కురవాలని సోమవారం కొటికలపూడి గ్రామంలో కప్పతల్లి గ్రామోత్సవం నిర్వహించారు. వరదల అనంతరం ముంపునకు గురైన పొలాలను తిరిగి సాగులోకి తీసుకువచ్చి వరి మినుము మొక్కజొన్న పంటలను సాగు చేశారు. అయితే విత్తనం నాటినప్పటి నుంచి వర్షాలు లేకపోవడంతో మొలకలు రాలేదు. దీంతో వర్షాల కోసం దేవుడిని ప్రార్థిస్తూ కప్పతల్లి గ్రామోత్సవం చేశారు. కార్యక్రమంలో రైతులతోపాటు చిన్నారులు కూడా పాల్గొన్ని సందడి చేశారు. **- న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నంగ్రామీణం**

పంచాయతీ పాలకవర్గ సభ్యులకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఎంపీపీ జ్యోత్స్న

ఇబ్రహీంపట్నంగ్రామీణం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం గ్రామీణ మండలానికి చెందిన ఉప సర్పంచులు, పంచాయతీల పాలకవర్గ సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామ పంచాయతీ పరిపాలన, ప్రభుత్వ పథకాలు వాటి అమలు తీరును మండల గ్రామీణాభివృద్ధి అధికారి మనోజ్ వివరించారు. కార్యక్రమాన్ని మండల పరిషత్తు అధ్యక్షురాలు పాలడుగు జ్యోత్స్న ప్రారంభించారు. ఎంపీడీవో సునీతశర్మ, గ్రామీణ మండలానికి చెందిన గ్రామ ఉప సర్పంచులు వార్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: నకిలీ మొక్కజొన్న విత్తనాలతో పంట నష్టం జరిగిందని ఎ.కొండూరుకు చెందిన నలుగురు కౌలు రైతులు చేసిన ఫిర్యాదు మేరకు సోమవారం గుంటూరు లాం ఫారం శాస్త్రవేత్తలు సీవీ.చంద్రమోహన్‌రెడ్డి, జీఏ.దయానాగ్రేస్ క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించారు. బాధిత రైతులు అక్కసాని రంగారావు, రాఘవులు, సుధారాణి, విజయలక్ష్మి విత్తనాలు కొనుగోలు, పంట నష్టంపై శాస్త్రవేత్తలకు వివరించారు. వాస్తవంగా మొక్కజొన్న కర్రకు ఒకటే కండె వేయాల్సి ఉండగా వీళ్ల సాగు చేసిన పైరులు నాలుగైదు అంగుళాల పొడవుతో నాణ్యతలేని ఐదారు పిలకలుగా కండెలు ఉన్నాయి. దీంతో దిగుబడి లేక ఆర్థికంగా నష్టపోయారు. పంట పరిశీలించిన శాస్త్రవేత్తలు నివేదికను జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయానికి పంపిస్తామన్నారు. ఏడీఏ జి.కెనడి, ఏవో ఎస్‌కే.టిప్పుసుల్తాన్ పాల్గొన్నారు.

కొండపల్లి పురపాలిక ఛైర్మన్ ఎన్నిక నిర్వహించండి



రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే వసంత

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి పురపాలిక ఛైర్మన్ ఎన్నికను నిర్వహించాలని ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నిని కోరారు. ఈ మేరకు విజయవాడ కార్యాలయంలో సోమవారం ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. పురపాలిక ప్రకటించడంతో పాటు కౌన్సిలర్ల ఎన్నిక జరిగి మూడేళ్లయిందని ఆమెకు తెలిపారు. త్వరలో ఛైర్మన్ ఎన్నికను అధికారికంగా నిర్వహించాలని కోరారు. కొండపల్లి కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

బాలికపై యువకుడి అత్యాచార యత్నం

కృష్ణలంక, న్యూస్‌టుడే: మద్యం మత్తులో బాలికపై యువకుడు అత్యాచారానికి యత్నించిన ఘటన విజయవాడ రాజీవ్‌గాంధీ పూలమార్కెట్ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జి.కొండూరు మండలం చెవుటూరుకు చెందిన సుబ్రహ్మణ్యం(22) మద్యం సేవించి ఆకతాయిగా సంచరిస్తూ ఉంటాడు. వన్‌టౌన్‌కు చెందిన ఓ మహిళ షోడాలు విక్రయిస్తూ ఉంటుంది. ఆదివారం ఆమె వెంట కుమార్తె(13) కూడా వచ్చింది. రాత్రి సుమారు 8 గంటల సమయంలో అక్కడకు చేరుకున్న యువకుడు ఆ బాలికను తీసుకుని రాజీవ్‌గాంధీ పూలమార్కెట్ సమీపంలోని రైల్వే ట్రాక్ వైపునకు వెళుతుండడాన్ని అక్కడే ఉన్న ముఠా కార్మికులు గమనించారు. కొద్దిసేపటికి బాలిక కేకలు వేయడాన్ని గమనించి వారు సమీపంలో దసరా బందోబస్తు విధుల్లో ఉన్న ఆర్ఎస్ఐ ఫజుల్లాబేగ్‌కు సమాచారం అందించారు. కానిస్టేబుల్ రాజును వెంటబెట్టుకుని ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వేతనాలు ఇప్పించాలని వినతి



కమిషనర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

కొండపల్లి, న్యూస్‌టుడే: నాలుగు నెలల వేతనాలను ఇప్పించాలని కొండపల్లి పురపాలిక పారిశుద్ధ్య కార్మికులు కమిషనర్ పి.శ్రీనివాస్‌ను కోరారు. ఒంగోలు నుంచి బదిలీపై వచ్చిన కమిషనర్ పి.శ్రీనివాసరావు సోమవారం కొండపల్లిలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కార్మికుల వేతనాలతో పాటు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో సీఐటీయూ మండల కార్యదర్శి మహేష్, కార్మికులు దేవుళ్లు, రమణ, సురేష్, అప్పారావు, నీవన్ తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

జి.కొండూరు, న్యూస్‌టుడే: మేతకు వెళ్లి తిరిగి వస్తూ విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన హెచ్.ముత్యాలంపాడులో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు గ్రామంలో ప్రాథమిక పాఠశాల సమీపంలో సీసీ రోడ్డు పక్కనే సెల్‌ఫోన్ టవర్ కోసం నియంత్రిక దానికి అనుసంధానంగా ఎర్త్ వైర్ ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన పచ్చిగోళ్ల విమలమ్మ తన గేదెను రోజులానే మేతకు తోలుకెళ్లగా తిరిగి వచ్చే క్రమంలో ఆ గేదె ఎర్త్ వైరుకు తగిలి విద్యుత్తు సరఫరా కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది.

ఇద్దరు దోపిడీ దొంగల అరెస్టు

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే : ఇద్దరు అంతరాష్ట్ర దోపిడీ దొంగలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పోలీసులు అరెస్టుచేసి వారి నుంచి రూ.4లక్షలకు పైగా విలువైన 50 గ్రాముల బంగారు ఆభరణాలను రికవరీ చేశారు. పాల్వంచ డీఎస్పీ సతీశ్‌కుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం. . సోమవారం అశ్వారావుపేటలోని జంగారెడ్డిగూడెం రహదారిలో సీఐ కరుణాకర్, ఎస్సై యయాతిరాజు, సాయికిశోర్ రెడ్డి వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలం రామచంద్రాపురానికి చెందిన బచ్చు సతీశ్, ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం మద్దులపర్వ గ్రామానికి చెందిన ఆరెంపుల ధర్మరాజు పోలీసులను చూసి కంగారుపడి పారిపోయేందుకు యత్నించారు. వారిని వెంబడించి పట్టుకుని విచారించగా పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి.

హత్యలకూ వెనకాడరు..

నిందితులిద్దరూ దోపిడీకి పాల్పడే సమయంలో అడ్డొచ్చిన వారిపై అతి కిరాతకంగా వ్యవహరించి చితకబాదడమే గాక హత్య చేసేందుకూ వెనుకాడరని డీఎస్పీ తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో వీరు 15 దోపిడీ కేసులతోపాటు, ఒకరిని హత్య చేసిన ఘటనలో వీరిద్దరు నిందితులు. ఏలూరు జిల్లా చాట్రాయిలో దోపిడీ సమయంలో అడ్డొచ్చిన ఒకరిని హత్య చేసిన ఘటనలో జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చారు. అయినా వీరు దోపిడీలను ఆపలేదు. పగలు రెక్కీ నిర్వహించి రాత్రి సమయంలో దొంగతనాలకు పాల్పడతారని డీఎస్పీ వివరించారు. ఈ ఏడాది సెప్టెంబరు 10న అర్ధరాత్రి అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం కాలనీలో రోడ్డు సమీపంలో నివాసం ఉంటున్న తుమ్మలపల్లి సత్యనారాయణపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచి అతని భార్య కళావతి మెడలోని 18గ్రాముల బంగారం గొలుసును లాక్కెళ్లారు. ఫిబ్రవరి 15 రాత్రి దమ్మపేట మండలం మందలపల్లిలో దాబా హోటల్‌లో నిద్రిస్తున్న వృద్ధురాలు మందలపు సత్తెమ్మపై దాడిచేసి ఆమె మెడలోని బంగారం నానుతాడును లాక్కెళ్లారు. అదే నెలలో విశ్రాంత ఉపాధ్యాయుడు అంజయ్య దమ్మపేట బ్యాంకు నుంచి రూ.40వేలు తీసుకెళుతుండటాన్ని గమనించి అతనిపై దాడిచేసి దోపిడీ చేశారు. వీరిపై అశ్వారావుపేట పోలీసు స్టేషన్‌లో ఒకటి, దమ్మపేటలో మూడు, ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో రెండు, వేంసూరులో రెండు, ఆంధ్రాలోని ఏలూరు జిల్లా చాట్రాయిలో మూడు, అవనిగడ్డ, రేపల్లె, విస్సన్నపేట, నూజివీడులో కేసులున్నాయి. నిందితులను కొత్తగూడెం కోర్టులో హాజరుపరచగా రిమాండు విధించారు.

గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యం

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణ సమీప కట్లేరు వాగులో సోమవారం సాయంత్రం గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. అందిన సమాచారం మేరకు వాగు వద్దకు వెళ్లగా సుమారు 30 ఏళ్ల వయసున్న యువకుడి మృతదేహం లభ్యమైందన్నారు. అతని కుడి చేతి మణికట్టుకు సైకిల్ గుర్తు ఉన్న బ్యాండ్ కూడా ఉందన్నారు. మృతదేహాన్ని తిరువూరు ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించామని ఎవరైనా యువకుడు అదృశ్యమైతే గుర్తించేందుకు మృతదేహాన్ని పరిశీలించుకోవచ్చని ఎస్సై పేర్కొన్నారు.

120 మద్యం సీసాల స్వాధీనం

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక పాత బస్టాండ్ పక్క రోడ్డులో తెలంగాణ మద్యాన్ని విక్రయిస్తున్న ఓ వ్యక్తి వద్ద నుంచి 120 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. పాత నేరస్థుడు ఒకరు మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు వెల్లడించారు.

జూదరులపై కేసు


రెడ్డిగూడెం: మండల పరిధిలోని కూనపరాజుపర్వ గ్రామంలో ఎన్ఎస్పీ కాల్వ కట్ట దగ్గరలో సోమవారం జూదమాడుతున్న వారిపై రెడ్డిగూడెం ఎస్సై మోహన్‌రావు, సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ క్రమంలో ఐదుగురిని పట్టుకొని వారి వద్ద రూ.14,150 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కొండవాగు ఇళ్లను ముంచుతోంది

- ★ అక్రమార్కుల ఆశకు అమాయకులు బలి
- ★ ఎక్కడికక్కడ ప్లాట్లు వేసి అమ్మకాలు
- ★ వరదల సమయంలో తప్పని అవస్థలు

కొండపల్లి, న్యూస్‌టుడే

అక్రమార్జన కోసం భూ దందాదారులు చేసిన ఆక్రమణల పర్వంతో కొండ వాగు దశ మార్చుకొని నివాసాలపైకి దూసుకెళుతోంది. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం గత నెల మొదట్లో వచ్చిన వర్షాలే. మూడు దశాబ్దాలుగా ఎన్నడూ వరద నీరు ఆ విధంగా రావడం గానీ, అవి ఇళ్ల పైకి వచ్చిన దాఖలాలు లేవని స్థానికులు వాపోతున్నారు. కొండపల్లి కోటకు వెళ్లే మార్గం నుంచి పురపాలిక ప్రాంతమంతా దిగువగా ఉంటుంది. ఎప్పుడు వర్షాలు వచ్చినా కొండమీద పడిన నీరంతా దిగువ భాగమైన తూర్పునకు చేరుకొని అక్కడి నుంచి రైల్ ట్రాక్ వద్ద ఉన్న తూముల నుంచి తారక రామ ఎత్తిపోతల పథకంలో కలుస్తాయి. వాడుక నీరు కూడా ఈ విధంగానే వెళుతున్నాయి. అయితే గతంలో ఉన్న విధంగా ఖాళీ స్థలాలు ఎక్కడా లేకపోవడం, నీరు పారుదల జరిగే పల్లపు ప్రాంతాలను కబ్జా చేసి ప్లాట్ల కింద వేసి అమ్మకాలు చేసుకోవడంతో నీరు దిగువకు వెళ్లే మార్గం మూసుకుపోయింది. దీంతో వాగు నీరు రహదారుల పైనే ప్రవహిస్తూ దిగువకు వెళుతున్నాయి.



ప్రస్తుతం ప్లాట్‌గా మారిన కొండవాగు దిగి వచ్చే ప్రాంతం



పై నుంచి వచ్చే నీటికి మార్గం అనువుగా లేక రహదార్లపై పారుతూ (పాతచిత్రం)

ఇల్లు వదిలి వెళ్లాం : షేక్ ఖాజా

కొండపల్లి బొమ్మలకాలనీ ఎగువ ప్రాంతంలో కొందరు వ్యక్తులు ప్లాట్లను విక్రయించే క్రమంలో వాగు నీరు దిగువకు వెళ్లే ప్రాంతాన్ని, మురుగు వ్యవస్థ పారుదలకు వదిలిన కాలువల స్థలాలను చిన్న ప్లాట్లుగా వేసి అమ్మేశారు. ఆ ప్రాంతంలో చిన్నపాటి ఇళ్ల నిర్మాణం జరిగి అనేక మంది నివాసాలను ఏర్పాటు చేసుకొన్నారు. దీని వల్ల కొండ నుంచి వచ్చే నీరు అస్తవ్యస్తంగా దిగువకు దిగుతూ ఇళ్ల పైకి వస్తున్నాయి. గత నెల మొదటి రోజు వచ్చిన వర్షానికి నడుము లోతు నీరు వచ్చి చేరాయి. ఇళ్లు వదిలి ఇతర చోట్ల ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వాగు నీరు వస్తే, ఊట వచ్చిందన్నారు: డి.సత్యం

కొండ పైనుంచి వాగు నీరు వస్తే రెవెన్యూ సిబ్బంది వచ్చి ఊట వచ్చిందని, అందుకు పరిహారం ఉండదని చెప్పి వెళ్లారు. ఇంట్లో ఉన్న విలువైన దస్త్రాలు తడిచిపోయాయి. తూములను సైతం పూడ్చి ప్లాట్లుగా వేశారు.

రెండు దశాబ్దాలలో వెలసినవే: అప్సర్

కొండ దిగువ ప్రాంతం గతంలో నిర్జీవంగా ఉండేది. రెండు దశాబ్దాల నుంచి నిర్మాణాలు పెరిగాయి. కొందరు స్వార్థపరులు ఇష్టానుసారంగా ప్లాట్లు వేసి అమ్మకాలు చేశారు. అమాయకులు వాటిని కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నారు. ఆ పాపానికి ఫలితమే కొండవాగు ఇళ్లపైకి పడుతుంది.

విజయవాడ తూర్పు

జగన్మాతకు నీరాజనం


లలితా త్రిపుర సుందరీ దేవిగా


హోమాలు చేస్తున్న దంపతులు


ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో దేవీ శరన్నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గోపూజ, శత చండీహోమాలు, మహారుద్రాభిషేకం, కుంకుమ పూజలు నిర్వహించారు. సాయంత్రం సామూహిక లలితా సహస్రనామ పారాయణం, అమ్మవారికి దశవిధ హారతులు ఇచ్చారు.

అమ్మవారికి బంగారు ముక్కు పుడకల వితరణ

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: విజయవాడ నగరం పటమటకు చెందిన నందమూరి కల్యాణ చక్రవర్తి, మాధవి దంపతులు తిరుపతమ్మ అమ్మవారికి ఆరు గ్రాముల బంగారు ముక్కు పుడకలు సోమవారం బహుకరించారు. వాటి విలువ రూ. 60 వేలు ఉంటుందని దాతలు తెలిపారు. దాతలకు వేదపండితుల ఆశీర్వచనాలు అందించారు. ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, ఆలయ విశ్రాంత ఏఈవో మేడా గోపాలరావు, పాలకవర్గ సభ్యులు శ్రీనివాసరావు, వెంకటరమణ పాల్గొన్నారు.

యువతా భళా!

ట్రెక్కింగ్‌కు వెళ్లి వచ్చిన నగర విద్యార్థులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

యువతలో క్రమశిక్షణ, దేశభక్తి నింపేందుకు ఎన్‌సీసీ ప్రముఖ పాత్ర వహిస్తోంది. డిగ్రీ చదువుకునే సమయంలోనే శిక్షణ ఇచ్చి వివిధ రాష్ట్రాల్లో నిర్వహించే శిబిరాలకు పంపిస్తారు. దీనివల్ల విద్యార్థుల మధ్య స్నేహపూర్వకమైన సంబంధాలు మెరుగుపడతాయి. జాతీయ సమైక్యతాభావం పెంపొందింతుంది. సైనికులుగా చేరి దేశానికి సేవలందించాలుకునే వారికి ఇది ఒక అనుభవంగా ఉంటుంది. అదే క్రమంలో ఇటీవల కేరళలోని ఇడుక్కి జిల్లాలో ట్రెక్కింగ్ శిబిరం నిర్వహించారు.


పర్వతాలపై ట్రెక్కింగ్ చేసిన ఎన్‌సీసీ క్యాడెట్లు

యువకులు నాలుగు పర్వతాలపై 32 కి.మీ. ట్రెక్కింగ్ చేసి భళా అనిపించారు. అక్కడి ప్రకృతి అందాలను వీక్షిస్తూ ఆనందంగా గడిపారు. ఎనిమిది రోజులు కేరళలో వివిధ ప్రాంతాల్లో విహరించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. నగరానికి చెందిన ఐదుగురు విద్యార్థులతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 525 మంది క్యాడెట్లు పాల్గొన్నారు. ఇందులో పాల్గొవడం వల్ల క్యాడెట్లకు బోనస్ మార్కులు కలుస్తాయని తెలిపారు. ట్రెక్కింగ్‌కు వెళ్లి వచ్చిన విద్యార్థులు ఏమంటున్నారో వారి మాటల్లో...


ఎన్‌సీసీ క్యాడెట్ల బృందం

ఆత్మవిశ్వాసం పెరిగింది : కె.శ్రావణి



కేరళలోని వివిధ ప్రాంతాలను సందర్శించడం ఎంతో ఆనందంగా ఉంది. నగరంలో బిజీబిజీగా తిరిగే ప్రజలు, వాహనాలు అక్కడ కనిపించలేదు. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. ఐదు రోజులప పాటు సూర్యరశ్మి ఎలా ఉందో కూడా తెలియలేదు. దట్టంగా మంచు ఉండడం వల్ల పర్వతాలు ఆకాశాన్ని తాకుతున్నట్లుగా అనిపించింది. వెళుతున్నప్పుడు జలగలు కనిపించడంతో చాలా భయపడ్డాం. పట్టుకుంటే ఏమి చేయాలో ముందుగానే శిక్షణ ఇచ్చారు. పాములు కూడా సంచరిస్తాయి. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇలాంటివి అన్ని ఎదుర్కొంటూ దిగ్విజయంగా పూర్తిచేశాం. కష్టాలు ఎదురైనప్పుడు ఏమి జరుగుతుందో అని భయపడకుండా ఆత్మవిశ్వాసం ఉంటే అన్ని పరిష్కారమవుతాయని తెలుసుకున్నా.

సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన : ఎన్.జ్ఞానకీర్తన



ఇన్నాళ్లు మన రాష్ట్రం దాటి బయటకు వెళ్లలేదు. ఎన్‌సీసీ శిబిరం వల్ల కేరళకు వెళ్లే అవకాశం దక్కింది. అక్కడ ఓనమ్ పెద్ద పండగ. ఆ సమయంలో అక్కడే ఉండడం వల్ల వేడుకలు ఎలా నిర్వహించుకుంటారో తెలుసుకున్నా. ఇతర రాష్ట్రాల క్యాడెట్లు పాల్గొన్నారు. వారి సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కలిగింది. పర్వతాలు ఎలా ఎక్కగలమా అని అనుకున్నా. చిన్న చిన్న ఇబ్బందులు తలెత్తినా సునాయాసంగా ఛేదించగలిగాం. సున్నా డిగ్రీల చలిని తట్టుకొని సైనికులు విధులు నిర్వహిస్తూ దేశానికి రక్షణగా నిలుస్తున్నారు. ఆ రంగంలో ప్రవేశించాలనుకునే వారి ఇలాంటి శిబిరాలు ఎంతో ప్రయోజనం కలుగుతాయి.

కుంకుమ పూజలు.. రుద్రాభిషేకాలు


దత్తపీఠంలో శ్రీమీనాక్షీ దేవిగా అమ్మవారు


పాల్గొన్న భక్తులు

పటమట, న్యూస్‌టుడే: పటమట దత్త పీఠంలోని శ్రీమరకత రాజరాజేశ్వరీ ఆలయంలో దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం అమ్మవారు శ్రీమీనాక్షీ దేవిగా భక్తులకు తర్శనమిచ్చారు. మహిళలు పెద్దఎత్తున సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం విశేషార్చన, మృత్యుంజయ ఆయుష్య సహిత రుద్రాభిషేకం నిర్వహించి మహామంగళ హారతి ఇచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వరద బాధితులకు వితరణ


నిత్యావసర వస్తువుల కిట్లు పంపిణీ చేస్తున్న ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, వైస్ ఛైర్మన్ మునిరత్నంలు

విజయవాడ బస్‌స్టేషన్, న్యూస్‌టుడే : ఇటీవల విజయవాడ పరిసర ప్రాంతాల్లో సంభవించిన వరదల కారణంగా సర్వం కోల్పోయిన ఆర్టీసీ ఒప్పంద పారిశుద్ధ్య కార్మికులు 130 మందికి ఒక్కోటి రూ.1500 విలువైన నిత్యావసరాల కిట్‌లను ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, వైస్ ఛైర్మన్ పి.ఎస్. మునిరత్నం చేతులమీదుగా అందించారు. ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో, ఆర్టీసీ హౌస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్, ఆర్టీసీ ఉన్నతాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.


దుప్పట్లు పంపిణీ చేస్తున్న శ్రీకాంత్

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: న్యూ సమైక్య మ్యారేజ్ మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం అజిత్‌సింగ్‌నగర్‌లోని వీరబ్రహ్మం ఆలయం వద్ద వంద మంది బాధితులకు దుప్పట్లు, స్టీలు సామగ్రి పంపిణీ చేశారు. తోటి మ్యారేజ్ మీడియేటర్లకు ఆర్థిక సాయం అందించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.శ్రీధర్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి వి.పట్టాభిరామయ్య, కోశాధికారి మహాలక్ష్మీ, సహాయ కార్యదర్శి సాయిప్రసాద్ చౌదరి, శ్రీలక్ష్మీ మ్యారేజి లింక్స్ అధినేత గొనుగుంట్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అఖిలాండేశ్వరీ.. చాముండేశ్వరీ

భక్తితో దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు

విజయవాడ తూర్పు నియోజకవర్గంలో దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కుంకుమ పూజలు, హోమాలు, లలితా సహస్ర నామ పారాయణలు, అన్నదానాలతో మండపాలు కళకళలాడుతున్నాయి. ఆయా కమిటీల ఆధ్వర్యంలో జరుగుతున్న వేడుకల్లో భాగంగా అమ్మవారు సోమవారం కొన్నిచోట్ల లలితా త్రిపుర సుందరీ దేవిగా, మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. - న్యూస్‌టుడే బృందం


కరెన్సీనగర్: సాయి బాబా మందిరంలో..


కృష్ణలంక వాసవీ సేవా భవనంలో మహాచండీదేవి అలంకారం


పటమట: దర్శిపేటలో..


లబ్బీపేట శిర్డిసాయిబాబా ఆలయంలో మహాచండీదేవిగా..


మొగల్రాజపురం ధనకొండపై..


లబ్బీపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో..


కృష్ణలంక: పీఎన్‌బీఎస్ సమీపంలో..


మారుతీనగర్ కోకాకోలా కంపెనీ రోడ్డు శ్రీరామాలయంలో..


కరెన్సీనగర్ దాసాంజనేయ ఆలయంలో..

సైబర్ వల.. ఉక్కిరిబిక్కిరి ఈ వల



ఈనాడు, నెల్లూరు: నేరవార్తలు, న్యూస్‌టుడే

'అచ్చం సీబీఐ అధికారిగా వ్యవహరించారు.. సైబర్ పోలీసులమంటూ బెదిరించారు.. ఆయన వివరాలన్నీ చెప్పేస్తూ నిజమైన అధికారులే అన్నట్లు నమ్మించారు. . వీడియో కాల్ విచారణ పేరిట హడావుడి చేశారు. చివరకు కేసు నుంచి బయటపడాలంటే రూ. 15 కోట్లు ఇవ్వాలని బెదిరించారు.

– ఇది సాక్షాత్తు భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డికి సైబర్ నేరగాళ్ల నుంచి ఎదురైన సంఘటన. దీనిపై ఆయన సోమవారం నెల్లూరు నగరంలోని వేదాయపాళెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు.

సాయం చేస్తున్నట్లు...

గత నెల 27వ తేదీ ఉదయం 8 - 9 గంటల మధ్య.. విజయవాడలో ఉన్న వాకాటి నారాయణ రెడ్డికి ఓ నంబరు నుంచి ఫోన్ వచ్చింది. పన్‌షుల్ అగర్వాల్ అనే పేరుతో పరిచయం చేసుకుని.. మీ పేరుతో ఓ పార్శిల్‌ను ముంబయి నుంచి థాయిలాండ్‌కు పంపించామని, అందులో పాస్‌పోర్టు, బ్యాంకు కార్డులు, ఇతర సామగ్రితో పాటు 200 గ్రాముల ఎండీహెచ్ఏ డ్రగ్స్ ఉన్నాయని చెప్పారు. అవి నేను పంపలేదని వాకాటి చెప్పగా.. మీ ఆధార్‌కార్డు వివరాలతో ఎవరైనా పంపి ఉంటారని.. మీ కాల్ సైబర్‌క్రైమ్స్‌కు ట్రాన్స్‌ఫర్ చేస్తాను.. ఫిర్యాదు చేయమని చెప్పారు. ఆ మాటలు నమ్మిన నారాయణరెడ్డి రవిచంద్ర అనే వ్యక్తికి ఫిర్యాదు చేశారు. వీడియో కాల్ ద్వారానే ఆధార్‌కార్డు వివరాలు కనుక్కుని.. ఆ తర్వాత మీపై మనీ లాండరింగ్ కేసులున్నాయని, సీబీఐ కేసు ఉందని చెప్పారు. దానికి అవన్నీ వ్యాపార కేసులని, ప్రస్తుతం కోర్టుల్లో ఉన్నాయని చెప్పగా.. మీ పేరుతో ముంబయిలో బ్యాంకు ఖాతా ఉందని, అందులో 43 మిలియన్ల యూఎస్‌డీ వచ్చిందన్నారు. తనకు ఖాతా లేదని వాకాటి చెప్పగా. . మీ ఆధార్, కేవైసీ దుర్వినియోగమై ఉండొచ్చని, వెరిఫికేషన్ పూర్తయ్యే వరకు సెల్ఫ్ కస్టడీలో ఉండాలని నమ్మబలికారు. విషయం ఎవరికీ చెప్పవద్దని, విజయవాడలో ఉంటున్న రూమ్ నుంచి బయటకు వెళ్లవద్దని చెప్పడంతో ఆయన అక్కడే ఉండిపోయారు. రెండు రోజుల తర్వాత.. మళ్లీ ఫోన్ చేసి.. అదే తరహా బెదిరింపులకు పాల్పడ్డారు. వివిధ పేర్లు.. వివిధ అంశాలతో బెదిరిస్తూ.. మిమ్మల్ని తప్పించేందుకు చూస్తున్నామని, దీనికి రూ.15 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పార్టీ దూరం పెట్టేలా చేస్తామంటూ..

తనకు ముంబయిలో ఖాతా లేదని, అక్కడి వ్యక్తులతోనూ సంబంధం లేదని, దాదాపు పదేళ్లుగా ముంబయి రాలేదని, ఇప్పటికే వ్యాపారాల్లో నష్టపోయా.. మీరు అడిగిన డబ్బు ఇవ్వలేనని వాకాటి చెప్పగా.. సైబర్ నేరగాళ్లు బెదిరింపులకు దిగారు. నిన్ను కస్టడీలోకి తీసుకుని విచారణ చేస్తామని, పార్టీకి దూరం పెట్టేలా చేయడంతో పాటు, ప్రజలు అసహ్యించుకునేలా చేస్తామని బెదిరించారు. తర్వాత అసిస్టెంట్ మానిటరింగ్ అధికారినంటూ మరో వ్యక్తి లైన్‌లోకి వచ్చి.. ఇప్పటి వరకు మీ మీద మంచిగా చెప్పిన అధికారి, ఇప్పుడు అడ్డగోలుగా కేసులు పెడుతున్నారని, అందులో టీపీడీఏ(టాడా)కేసు పెట్టాలని ఫైల్ తయారు చేస్తున్నట్లు బెదిరించారు. ఈ నెల 10వ తేదీ ముంబయి రావాలని, లేకుంటే మీ లైఫ్ రిస్క్‌లో పడుతుందని హెచ్చరించారు. ఈ నెల 4వ తేదీ వరకు ఎప్పటికప్పుడు వారికి సమాచారం ఇచ్చిన వాకాటి.. ఇదంతా సైబర్ నేరగాళ్ల పని భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాష్ట్ర అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో పతకాలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలో ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో ఉమ్మడి కృష్ణా జిల్లా అథ్లెట్లు రెండు పసిడి, అయిదు రజత, ఆరు కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారని జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి బి.నాగలక్ష్మి తెలిపారు. బాలుర అండర్-18 విభాగంలో సీహెచ్ నరేష్ జావెలిన్ త్రోలో పసిడి, అండర్-20 బాలుర విభాగంలో పి.తరుణ్ హామ్మర్‌త్రోలో పసిడి పతకాలు కైవసం చేసుకోగా.. అండర్-18 బాలికల విభాగంలో పి.ఇందుమతి 100మీ. హర్డిల్స్, అండర్-20 బాలికల విభాగంలో ఎస్.నాగధాత్రి 100మీ. హర్డిల్స్, అండర్-20 బాలుర విభాగంలో బి.సిద్ధార్థ షాట్‌పుట్, బాలికల విభాగంలో యు.రమ్య 400మీ. హర్డిల్స్, కె.పవిత్ర జావెలిన్‌త్రోలో రజత పతకాలు సొంతం చేసుకున్నారు. అండర్-18 బాలుర విభాగంలో పి.మోహన్ 100మీ. హర్డిల్స్, ఎస్‌కే మొహమ్మద్ హుస్సేన్ 400మీ., అండర్-20 బాలుర విభాగంలో ఎం.బ్రహ్మాజీ 110మీ. హర్డిల్స్, బాలికల విభాగంలో యు.రమ్య డిస్కస్‌త్రో, ఎం.శృతి 400మీ. హర్డిల్స్, కె.పవిత్ర షాట్‌పుట్‌లో కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారని పేర్కొన్నారు. పతకాలు కైవసం అథ్లెట్లను, కోచ్‌గా వ్యవహరించిన బి.వెంకటేష్‌ను పలువురు అభినందించారు.

నేటి నుంచి ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్

విజయవాడ క్రీడలు: గుంటూరు జిల్లా నాగార్జున నగర్‌లోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఈ నెల 8 నుంచి నాలుగు రోజులు రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ నిర్వహిస్తామని రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి ఎం.డానియేల్ ప్రదీప్ తెలిపారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన పురుషుల జట్లు పాల్గొంటాయన్నారు. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో జరిగే ఈ ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభగల క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో సంతోష్ ట్రోఫీ కోసం జరిగే జాతీయ సీనియర్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన తెలిపారు.

9 నుంచి ఆహ్వానపు కబడ్డీ పోటీలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: మంగళగిరిలోని గౌతమ బుద్ధ రోడ్డులో బీఎండబ్ల్యూ షోరూమ్ పక్కన ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి ఆహ్వానపు స్త్రీ, పురుషుల కబడ్డీ టోర్నీని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని రాష్ట్ర కబడ్డీ సంఘం కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ తెలిపారు. 'మంగళగిరి కబడ్డీ లీగ్-2024' పేరుతో నిర్వహిస్తున్న ఈ టోర్నీలో రాష్ట్రంలోని అత్యుత్తమ ప్రతిభగల 13 పురుషుల, ఎనిమిది మహిళల జట్లు పాల్గొంటాయని ఆయన పేర్కొన్నారు.

కామయ్యతోపులో కారు బీభత్సం

పెనమలూరు, న్యూస్‌టుడే: యువకులు కారుతో బీభత్సం సృష్టించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నగరంలోని పెనుబోతుల తేజ వెంకటపవన్ విజయవాడలో ఓ కళాశాలలో చదువుతున్నాడు. ఆదివారం రాత్రి వీరు తమ స్నేహితుడి జన్మదిన వేడుకలకు వెళ్లారు. అక్కడ మద్యం తాగిన వీరు.. ఓ స్నేహితుడిని దించడానికి తమ వాహనంలో తాడిగడప బయల్దేరారు. కామయ్యతోపు వద్దకు వచ్చే సరికి కారు అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న దుకాణాలు, ఫుట్‌పాత్‌ల పైకి దూసుకెళ్లింది. అంతటితో ఆగకుండా గాలిలోకి ఎగిరి పల్టీలు కొట్టడంతో బందరు రోడ్డుపై తిరగబడింది. కారులో ఉన్న ఐదుగురు యువకులు గాయాలపాలయ్యారు. కారు నడిపింది వెంకటపవన్‌గా గుర్తించారు. కారులో ఉన్న కార్తికేయ, రోహిత్.. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య పరీక్షలపై అవగాహన

విజయవాడ సిటీ: సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ప్రాక్టీస్ విభాగం ఆధ్వర్యంలో ఫెయిత్ అకాడమీ సహకారంతో వైద్య పరీక్షలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోగులకు ఇంజిక్షన్ చేయడం, ఐవీసెట్లు పెట్టడం, రక్తపోటు, ఈసీజీ తదితర ప్రాథమిక పరీక్షలపై వైద్యనిపుణులు అనిల్‌కుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించి వారితో చేయించారు.

నేటి నుంచి జాతీయ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నీ


మెయిన్ డ్రాకు అర్హత సాధించిన హేమంత్‌శ్రీ (ఏపీ)

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నగరంలోని సీహెచ్ఆర్‌కే వీఎంసీ, ఎస్ఎస్‌బీఏ ఇండోర్ స్టేడియాల్లో ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు 'యోనెక్స్ సన్‌రైజ్ కలగర నాగబాబు స్మారక ఆలిండియా సబ్ జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నీ-2024' నిర్వహిస్తామని రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి, శాప్ మాజీ ఛైర్మన్ పోలినేని అంకమ్మ చౌదరి తెలిపారు. ఈ నెల 4 నుంచి జరిగిన క్వాలిఫైయింగ్ రౌండ్స్ సోమవారం ముగిశాయి. క్వాలిఫైయింగ్ రౌండ్స్ నుంచి అండర్-15, 17 బాలబాలికల సింగిల్స్‌లో 32 మంది షట్లర్ల చొప్పున, డబుల్స్, మిక్స్‌డ్‌లో 16 జట్ల చొప్పున మెయిన్ డ్రాకు అర్హత సాధించాయి. సోమవారం జరిగిన క్వాలిఫైయింగ్ ఫైనల్ రౌండ్‌లో పలువురు షట్లర్లు హోరా.. హోరీగా తలపడ్డారు. అండర్-15 బాలుర విభాగంలో ఎస్.హేమంత్‌శ్రీ, సీహెచ్ విజయ్ చరణ్, బాలికల విభాగంలో ఆర్.లక్ష్మీ సాయి ఆరాధ్య, ఎం.దీవెన రాణి, జి.సుష్మారెడ్డి, డి.ధన్య సంజన, ఎస్.మనస్విలు మెయిన్ డ్రాకు రాష్ట్ర నుంచి అర్హత సాధించారు. అండర్-17 బాలుర విభాగంలో డి.శేఖర శతమన్యు, కె.సాయి సాహిల్, కె.శ్రీకర వెంకట ప్రణీత్, వి.హరికృష్ణ, కె.రాహుల్, బాలికల విభాగంలో ఆర్.లక్ష్మీ సాయి ఆరాధ్య, బి.విజయలక్ష్మి, రేణుశ్రీ, కె.గగన శ్రీచౌదరి, జి.సుష్మారెడ్డిలు రాష్ట్రం నుంచి మెయిన్ డ్రాకు అర్హత సాధించారని అంకమ్మచౌదరి చెప్పారు.

కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్‌లో కాంస్యం



విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: దక్షిణాఫ్రికాలోని సన్‌సిటీలో ఈ నెల 4 నుంచి 13వ తేదీ వరకు జరుగుతున్న కామన్వెల్త్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ సబ్ జూనియర్, జూనియర్ పోటీల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన రాష్ట్ర లిఫ్టర్ నాగం జ్ఞానదివ్య ఓవరాల్ కాంస్య పతకంతో మెరిసింది. మొత్తం నాలుగు కాంస్య పతకాలు సాధించిన **జ్ఞానదివ్య..** స్క్వాట్‌లో 160 కేజీలు, బెంచ్ ప్రెస్‌లో 55 కేజీలు, డెడ్ లిఫ్ట్‌లో 157.5 కేజీలతో మొత్తం 372.5 కేజీల బరువెత్తి ఓవరాల్ తృతీయ స్థానంలో నిలిచిందని రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా సత్తా చాటిన జ్ఞానదివ్యను, ఆమె శిక్షకురాలు శిరీషను దక్షిణ భారత పవర్ లిఫ్టింగ్ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి సకల కోటేశ్వరరావు, పలువురు లిఫ్టర్లు అభినందించారు.

ఇజ్రాయిల్‌ది సామ్రాజ్యవాద దురహంకారం


మాట్లాడుతున్న బాబూరావు

కృష్ణలంక, న్యూస్‌టుడే: పాలస్తీనాపై దాడి చేసి వేలాది మందిని పొట్టనబెట్టుకున్న ఇజ్రాయిల్‌ది సామ్రాజ్యవాద దురహంకారమని వామపక్ష పార్టీల నాయకులు ఉద్ఘాటించారు. 10 వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో బాలోత్సవ భవన్‌లో సోమవారం పాలస్తీనా సంఘీభావ సభ నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ కేవలం పాలస్తీనాను ఆక్రమించుకోవాలనే దురుద్దేశంతోనే ఇజ్రాయిల్ ఇష్టారాజ్యంగా బాంబులు కురిపిస్తోందన్నారు. అధికారికంగానే 45 వేల మంది చనిపోయినట్లు చెబుతుండగా వారిలో 16 వేల మంది చిన్నారులేనన్నారు. ఈ యుద్ధ ప్రభావం ప్రపంచ ఆర్థిక, రాజకీయ అంశాలపై పడే అవకాశం ఉన్నందున వెంటనే అడ్డుకోవాలన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ సభకు అధ్యక్షత వహించగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రావులపల్లి రవీంద్రనాథ్, ఆయా పార్టీలకు చెందిన పి.ప్రసాద్, జాస్తి కిషోర్‌బాబు, సుధీర్, సలీమ్, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై యువకుడి అత్యాచార యత్నం

కృష్ణలంక: మద్యం మత్తులో బాలికపై యువకుడు అత్యాచారానికి యత్నించిన ఘటన విజయవాడ రాజీవ్‌గాంధీ పూలమార్కెట్ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జి.కొండూరు మండలం చెవుటూరుకు చెందిన సుబ్రహ్మణ్యం(22) మద్యం సేవించి ఆకతాయిగా సంచరిస్తూ ఉంటాడు. వన్‌టౌన్‌కు చెందిన ఓ మహిళ కెనాల్ రోడ్డు వినాయకుడి గుడి సమీపంలో షోడాలు విక్రయిస్తూ ఉంటుంది. ఆదివారం ఆమె వెంట కుమార్తె(13) కూడా వచ్చింది. రాత్రి సుమారు 8 గంటల సమయంలో అక్కడకు చేరుకున్న యువకుడు ఆ బాలికను తీసుకుని రాజీవ్‌గాంధీ పూలమార్కెట్ సమీపంలోని రైల్వే ట్రాక్ వైపునకు వెళుతుండడాన్ని అక్కడే ఉన్న ముఠా కార్మికులు గమనించారు. కొద్దిసేపటికి బాలిక కేకలు వేయడాన్ని గమనించి వారు సమీపంలో దసరా బందోబస్తు విధుల్లో ఉన్న ఆర్ఎస్ఐ ఫజుల్లాబేగ్‌కు సమాచారం అందించారు. కానిస్టేబుల్ రాజును వెంటబెట్టుకుని ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోక్సో చట్టంపై కేసు నమోదు చేసిన పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నందిగామ
• నందిగామ • జగ్గయ్యపేట

స్పందనకు వందనం

❖ కొణకంచి ఎస్సీ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు 'ఈనాడు' 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా సర్పంచి గోనేల దేవి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. స్పందించిన ఆమె వెంటనే సిబ్బందిని పంపించి దీపాలకు మరమ్మతులు చేయించారు.

❖ పెనుగంచిప్రోలు తూర్పు బజార్‌లో డ్రెయిన్ పూడిక తీయాలని కోరుతూ 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా సర్పంచి వేల్పుల పద్మకుమారి దృష్టికి తీసుకెళ్లగా, ఆమె సోమవారం కార్మికులను పంపించి డ్రెయిన్లు శుభ్రం చేయించారు.

❖ అనిగండ్లపాడులో గ్రామం మధ్యలో పారుతున్న మునేరు కాలువ కట్టలపై స్థానికులు వ్యర్థాలు పడేస్తున్నారు. వాటిని తొలగించాలని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా సర్పంచి బి. జ్యోతికి తెలిపారు. కార్మికులతో చెత్త, ఇతర వ్యర్థాలను తొలగించారు.

❖ పెనుగంచిప్రోలు-ముండ్లపాడు ఆర్‌అండ్‌బీ రోడ్డులో చెరువు అలుగు వద్ద రహదారి ధ్వంసం కావడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, పెనుగంచిప్రోలు

శ్మశానవాటిక స్థలం ఆక్రమించి ఇంటి నిర్మాణం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని లింగాలపాడులో హిందూ శ్మశానవాటిక స్థలాన్ని ఆక్రమించి వైకాపాకు చెందిన ఓ వ్యక్తి ఇంటిని నిర్మించాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. సుమారు ఆరు సెంట్ల స్థలంలో పక్కా భవనం నిర్మించినా అధికారులు పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. దీనిపై డీపీవో, పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశామని స్థానికుడు పి. ప్రకాష్ తెలిపారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి సీతారామిరెడ్డిని వివరణ కోరగా ఆక్రమించిన వ్యక్తికి స్థలాన్ని ఖాళీ చేయాలని నోటీసు ఇచ్చామని చెప్పారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి శ్మశానవాటిక స్థలంలో ఉన్న ఆక్రమణలన్నింటినీ తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఇసుక నిల్వలు ఖాళీ

లబ్ధిదారుల ఎదురుచూపులు
ప్రభుత్వం దృష్టి సారించాలని వినతి

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రారంభించినా గనుల శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల లబ్ధిదారులకు ఇసుక అందని పండుగా మారింది. గ్రామ సచివాలయాల్లో ఇసుక బుక్ చేసుకునేలా వెబ్‌సైట్‌ను ప్రారంభించినా స్థానికంగా ఇసుక స్టాకు పాయింట్లలో ఇసుక నిల్వలు అందుబాటులో ఉండడం లేదు. గతంలో స్థానికంగా ఇసుక టన్ను రూ.399 వంతున విక్రయించారు. ఒక్కో ఆధార్ కార్డుకు రోజుకు 20 టన్నులకు మించకుండా ఇసుక రవాణా చేసుకునే అవకాశం కల్పించారు. ప్రస్తుతం ఎక్కడా ఇసుక అందుబాటులో లేకపోవడంతో ఇళ్ల నిర్మాణదారులు అవస్థలు పడుతున్నారు. దీని వల్ల పరోక్షంగా తాపీ కార్మికులకు పనులు లభించని పరిస్థితి ఏర్పడింది.


పాతకంచల స్టాకు పాయింట్‌లో లారీకి లోడింగ్ (పాత చిత్రం)

❖ నందిగామ మండలంలో మునేటి ఇసుకను పాతకంచల, పల్లగిరి వద్ద స్టాకు పాయింట్లలో గతంలో అందుబాటులో ఉండడంతో స్థానికులంటే విజయవాడ ప్రాంతం నుంచి వచ్చిన టిప్పర్లకే ఇసుక తరలించారు. ఒక్కో టన్నుకు రూ.399 వంతున ట్రాక్టర్‌కు అయిదు టన్నుల ఇసుకను, టిప్పర్‌కు 20 టన్నుల ఇసుకను రవాణా చేశారు. ఇప్పుడు రెండు మాసాలుగా ఇసుక అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

❖ మునేటికి వరదలు రావడంతో ఎడ్ల బండ్లతో తరలించడానికి వీలు పడడం లేదు. పాతకంచల, మాగల్లు ఇసుక క్వారీల్లో తవ్వకాలు చేపట్టి స్టాకు పాయింట్లలో ఇసుకను నిల్వచేసి ఉంటే ప్రస్తుతం ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్న లబ్ధిదారులకు ఇసుక లభించేది. ప్రస్తుతం ఏపీ మైనింగ్ పోర్టల్‌లో ఉచిత ఇసుకను బుక్ చేసుకోడానికి సర్వర్ సమస్యతో వీలు పడటం లేదని బాధితులు వాపోతున్నారు.

❖ వాగుల్లో ఉచితంగా ఇసుక రవాణా చేసుకునే సౌలభ్యం ఉన్నా వీటిపై గనులు, రెవెన్యూ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు నిర్లక్ష్యం వీడి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానం లబ్ధిదారులకు ఇసుక అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

దురాభారంతో ఇబ్బందులు

పోర్టల్‌లో ఇసుకను బుక్ చేసినా నందిగామ మండలంలోని లబ్ధిదారులకు కంచికచర్ల, జగ్గయ్యపేట ప్రాంతంలోని ఇసుక స్టాక్ పాయింట్ల నుంచి తెచ్చుకోవడం దూరాభారంగా మారుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ మండలంలో ఇసుక అందుబాటులో ఉండేలా చూడాలని లబ్ధిదారులు కోరుతున్నారు. గతంలో స్టాకు ఇసుక స్టాకు పాయింట్లలో వాహనాలు కూరుకు పోయాయని, ఇసుక తరలించడానికి ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. స్టాకు పాయింట్ల వద్ద ర్యాంపులను అభివృద్ధి చేయించాలని కోరుతున్నారు.

సెలవుల్లో తరగతుల నిర్వహణపై ఆందోళన

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న పలు ప్రైవేట్ పాఠశాలల వద్ద సోమవారం ఎస్ఎఫ్ఐ నాయకులు ఆందోళన చేశారు. పల్లగిరి మరియనివాస్, నందిగామ గౌతమ పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తుండగా ఆ శాఖ నాయకులు షేక్ ఖాజా, వెంకటేష్, హుసేన్, నరసింహ, ప్రేమ్‌కుమార్ విద్యార్థులను ఇళ్లకు పంపారు. ప్రభుత్వం ఈనెల 14 వరకు దసరా సెలవులు ఇచ్చినా ప్రైవేట్ పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తున్నారని, దీనిపై స్థానిక డీవైఈవోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారులు స్పందించి తరగతులు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శిక్షణ కార్యక్రమం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: చిల్లకల్లులో మండల స్థాయి శిక్షణ కార్యక్రమం సోమవారం మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి వైఎస్ మాధవశర్మ అధ్యక్షతన ప్రారంభించారు. మొదటి రోజు పరిచయ కార్యక్రమం, రాజీ లేని సూత్రాలు-శిక్షణ ఉద్దేశం, పరిపాలన విభాగాలు, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం-1994, గ్రామ పంచాయతీ సమావేశాలు, గ్రామసభ, పర్యవేక్షణ, తనిఖీలు తదితర అంశాల గురించి వివరించారు. ప్రభుత్వ విధానం గురించి ట్రైనర్ కార్లపాటి శ్రీనివాసరావు, గూగులోతు సైదా వివరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల నుంచి ఉపసర్పంచులు, ఇద్దరు వార్డు మెంబర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారని ఎంపీడీవో జి. నితిన్ తెలిపారు.

జోరు వాన

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ పరిసరాల్లో సోమవారం సాయంత్రం వర్షం కురిసింది. వర్షంతో నందిగామలో రహదారులు జలమయమయ్యాయి. మాగల్లు, పల్లగిరి తదితర గ్రామాల్లో కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్నలు తడవకుండా రైతులు పట్టాలు కప్పారు. విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రెండు రోజులుగా సాయంత్రం వేళ వర్షం కురుస్తుండటంతో పత్తి పంటలో నీరు నిలిచింది. పత్తి, మిర్చి పంటల్లో తేమ తగ్గేలా రైతులు యూరియా చల్లుతున్నారు.

పట్టభద్రులతోనే ప్రజాస్వామ్య స్ఫూర్తి: ఆలపాటి

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: పట్టభద్రుల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తి మెల్కొన్నప్పుడే మెరుగైన ప్రభుత్వాలు ఏర్పడతాయని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆయన ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఆధ్వర్యంలో జగ్గయ్యపేట ఉక్కు కళా వేదికలో సోమవారం జరిగిన సన్నాహక సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఐదేళ్ల దుష్ట పాలనను అంతం చేయడంలో ఏ ఓటు అస్త్రాన్ని ఉపయోగించారో అదే అస్త్రంతో అన్ని స్థాయిల్లో, వ్యవస్థల్లో సుపరిపాలనకు మద్దతునివ్వాలని అన్నారు. ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ.. రాబోయే పట్టభద్రుల ఎన్నికల్లో ఆలపాటి విజయం లాంఛనప్రాయమని పేర్కొన్నారు. మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, నాయకులు మేకా వెంకటేశ్వర్లు, కట్టా నరసింహారావు, వడ్లమూడి రాంబాబు, కీసర రాంబాబు, ఇ. కిషోర్, కె. రామలక్ష్మి, ఎ. రాణి, కుసుమలత, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆలపాటి, వేదికపై తాతయ్య, రాఘవేంద్ర తదితరులు

తెదేపా ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి

నందిగామ, న్యూస్‌టుడే: కృష్ణా, గుంటూరు పట్టభద్రుల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కోరారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్సీ అభ్యర్థిని సన్మానించి తెదేపా పోలింగ్ బూత్ ఇన్‌ఛార్జులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజేంద్రప్రసాద్ ఎమ్మెల్యేగా, మంత్రిగా సేవలందించారని చెప్పారు. పట్టభద్రుల ఓటర్లను చేర్పించి ఆయన గెలుపునకు పని చేయాలని కోరారు. కార్యక్రమంలో తెదేపా నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, నియోజకవర్గ నాయకులు కోట వీరబాబు, కోగంటి బాబు, చీదిరాల భరత్ రెడ్డి, ఏచూరి రాము, వీరాస్వామి, తొర్లికొండ సీతారామయ్య, పంగా సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపిక

జగ్గయ్యపేట: పట్టణంలోని తపోవన్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బి. సాయిరాం జిల్లా క్రికెట్ జట్టులో ఆడేందుకు ఎంపిక కావడంతో ఆ పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. విద్యార్థిని ప్రోత్సహించడం కోసం అతనికి విలువైన క్రికెట్ బ్యాట్‌ను సోమవారం పాఠశాల ప్రిన్సిపల్ సుధీర్ అందించారు.

ఆసుపత్రి వర్గాలపై అధికారులకు ఫిర్యాదు

జగ్గయ్యపేట: పట్టణంలో ప్రభుత్వాసుపత్రి ప్రహరీకి అనుసంధానంగా రైతుబజార్ ఎదురుగా ఉన్న రైసింగ్‌సన్ బడ్డి కోట్ల సంఘ సభ్యులు తన దుకాణాన్ని మూసి వేయించాలని కుట్ర పన్నుతున్నారని దుకాణదారుడు ఉప్పెల్లి రవి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దుకాణం తెరకపోవడంతో ఖాళీ చేయించాలని నోటీసులు అంటించారని, అదే కాంప్లెక్స్‌లో కొందరు దుకాణాలను అమ్ముకున్నా పట్టించుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

సత్యమ్మతల్లికి పట్టు వస్త్రాల సమర్పణ


ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ దంపతులకు సత్యమ్మతల్లి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని అంబారుపేట సత్యమ్మతల్లికి సోమవారం మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, శిరీష దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. లలితాత్రిపురసుందరిగా దర్శనమిచ్చిన అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు మంచాల మాధవ్, చుండు వాసు, ఈవో హరి గోపీనాథ్ అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. అర్చకులు నందిగామ వెంకట సుబ్బారావు, సూరేపల్లి వీరభద్రయ్య శర్మ ఆశీర్వచనం ఇచ్చారు.

తిరుపతమ్మకు బంగారు ముక్కు పుడకల వితరణ

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: విజయవాడ నగరం పటమటకు చెందిన నందమూరి కల్యాణ చక్రవర్తి, మాధవి దంపతులు తిరుపతమ్మ అమ్మవారికి ఆరు గ్రాముల బంగారు ముక్కు పుడకలు సోమవారం బహూకరించారు. వాటి విలువ రూ. 60 వేలు ఉంటుందని దాతలు తెలిపారు. దాతలకు వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో తిరుమలేశ్వర రావు, ఆలయ విశ్రాంత ఏఈవో మేడా గోపాలరావు, పాలకవర్గ సభ్యులు శ్రీనివాసరావు, వెంకటరమణ పాల్గొన్నారు.



ఆలయానికి రూ.6.22 లక్షల ఆదాయం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: వేదాద్రి గ్రామంలోని శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి రూ. 6.22 లక్షలు ఆదాయం వచ్చిందని కార్యనిర్వాహణాధికారి కె. సురేష్‌బాబు తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో తొట్టెలపూరు శ్రీవేణుగోపాల స్వామి దేవస్థాన కార్యనిర్వాహణాధికారి సి.హెచ్. హరిదుర్గ నాగేశ్వరావు పర్యవేక్షణలో బహిరంగ వేలం నిర్వహించారు. కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే లైసెన్స్‌కు రూ. 3.12 లక్షలు, తులసీ పూలు అమ్ముకునే లైసెన్స్‌కు 3.10 లక్షలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త ప్రతినిధి పి. రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడికి సన్మానం


వెంకటేశ్వర్లుకు జ్ఞాపిక అందిస్తున్న సుబ్బారావు

జగ్గయ్యపేట గ్రామీణం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు గంటా వెంకటేశ్వర్లును ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖ అధికారి వైయూ సుబ్బారావు, ఏడీ కుమారులు సన్మానించారు. ఈ ఏడాది జులై నెలలో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 3 బంగారు పతకాలు, 1 స్ట్రాంగ్ మ్యాన్ ఆఫ్ ఇండియా అవార్డు సాధించారు. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు గంటా వెంకటేశ్వర్లు డీఎస్‌ఈఓ సుబ్బారావును మర్యాదపూర్వంగా కలిసిన సందర్భంగా ఆయన్ను సన్మానించారు. గతంలో వెంకటేశ్వర్లు 2022లో కోయంబతూర్‌లో జరిగిన పోటీల్లో 3 బంగారు పతకాలు, 1 స్ట్రాంగ్ మ్యాన్ టైటిల్, 2023లో 3 బంగారు పతకాలు, 2 స్ట్రాంగ్ మ్యాన్ అవార్డులు సాధించారు.

పట్టణ శివార్లు.. సమస్యాత్మక రహదారులు


విద్యానగర్-ధనంబోడు కాలనీ రహదారుల్లో అండర్ పాసింగ్ వద్ద నీరు నిలిచి

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే

గణనీయంగా విస్తరిస్తూ 31 వార్డులుగా రూపుదిద్దుకున్న జగ్గయ్యపేట పట్టణ పురోభివృద్ధికి శివారు ప్రాంతాల రహదారుల దుస్థితి పెద్ద అవరోధంగా మారుతున్నాయి. పలు గ్రామాల కలయికతో 60 వేలకు పెరిగిన జనాభాకు తగ్గట్టు రహదారుల ఏర్పాటు లేకపోవడం పట్టణానికి ఒక శాపంగా పరిణమిస్తోంది. ముఖ్యంగా ప్రధాన రహదారులు, కొన్ని ముఖ్య ప్రాంతాల అంతర్గత రహదారులు మినహా 60 శాతం వీధుల్లో ఏదో ఒక సమస్యతో అనునిత్యం ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నాయి. ప్రధాన మున్సిపల్ కూడలి నుంచి పట్టణం విజయవాడ రోడ్డు వైపు చిల్లకల్లు, కోదాడ రోడ్డులో అడ్డరోడ్డు, ముక్త్యాల రోడ్డులో పద్మావతి నగర్, బలుసుపాడు రోడ్డులో త్రిపురవరం క్రాస్‌రోడ్డు వరకు పట్టణ విస్తరణ కి.మీ. మేర జరుగుతుంది. కానీ విస్తరించే శివారు ప్రాంతాలు పటిష్ఠమైన ప్రణాళికతో రూపుదిద్దుకున్నవి కాకపోవడంతో అనుసంధానం లేని రహదారులకు తోడు వాటి వెడల్పు కూడా అస్తవ్యస్థంగా మారింది.

ఇరుకు రోడ్లు.. అనధికార లేఔట్లు..

❖ అసలే ఇరుకు రహదారులు కావడంతో పాటు అవి ఆక్రమణలకు గురికావడం, అసలు అధీకృత లేఔట్లు లేని కారణంగా రహదారులు చిన్నగా, ఒంపు తిరిగి ఉండటం మరో సమస్య. మట్టి రోడ్లు ఉన్న ప్రాంతాల్లో వర్షాకాలం బురద, ఇతర కాలాల్లో గోతులు వేధిస్తున్నాయి.


❖ సిమెంట్ రహదారులు నిర్మించిన ప్రాంతాల్లో నీరు నిలిచి ఉండడం, డ్రైన్లు లేక రోడ్ల పైకి నీరు ప్రవహించడం వంటి అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కౌన్సిల్ సమావేశాల్లో ఆయా వార్డుల కౌన్సిలర్లు తమ వార్డులోని రహదారి సమస్యలపై లేవనెత్తినా సమాధానాలు తప్ప పరిష్కారాలు మాత్రం కనిపించడం లేదు. పైగా వరదలు, వర్షాలకు జరిగే తీవ్రమైన తాకిడికి సమస్య మరింత జఠిలం అవుతోంది.


శాంతినగర్ దారిలో చెట్లతో..

❖ విజయవాడ రోడ్డు నుంచి విద్యానగర్ వెళ్లే దారిలో ఉన్న అండర్ పాసింగ్ ఎప్పుడూ నీటితో నిండి ఉండడంతో వాహనదారులు, పాదచారులు బురదలో ప్రయాణించాల్సి వస్తోందని వాపోతున్నారు.


❖ ఈ విషయమై కమిషనర్ రామ్మోహన్‌ను వివరణ కోరగా శివార్ల రహదారులపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. విద్యానగర్ అండర్ పాసింగ్ వద్ద మరమ్మతులకు రైల్వే శాఖ అనుమతి రావాల్సి ఉందని, ప్రత్యేక మోటారు ఏర్పాటు చేసి నీటిని తోడేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.


నందిగామ గ్రామీణం: అన్నపూర్ణాదేవిగా..


నందిగామ గ్రామీణం: మహాలక్ష్మి


నందిగామ గ్రామీణం: మహా చండీదేవిగా


శ్రీగురుధామ్ ధర్మక్షేత్రంలో..


జగ్గయ్యపేటలో..


నవాబుపేటలో..


కంచికచర్ల: గాయత్రి దేవిగా..


కంచికచర్లలో లలితాత్రిపుర సుందరిగా..

చూసిన కనులదే భాగ్యం

వివిధ రూపాల్లో అమ్మవారి దర్శనం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో సోమవారం అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. నందిగామ శివాలయంలో శుకల్యామలాంబను అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. అర్చకుడు దండిభొట్ల బాలకృష్ణ శాస్త్రి కుంకుమార్చనలు చేశారు. స్వయంభూ మరిడీ మహాలక్ష్మి అమ్మవారు స్వర్ణకవచ అలంకరణతో, వాసవీమాత మహా చండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. రెవెన్యూ కాలనీలో అంకమ్మతల్లికి వేదపండితుడు గౌరిపెద్ది శేష కుంకుమార్చన నిర్వహించారు. అంబారుపేటలో సత్యమ్మతల్లిని లలితాత్రిపురసుందరిగా, పల్లగిరిపై త్రిశక్తి దేవాలయంలో కనకదుర్గమ్మను లలితాత్రిపురసుందరిగా అలంకరణ చేసి మహిళలు సామూహికంగా కుంకుమార్చనలు చేశారు.

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: దుర్గాదేవి శరన్నవరాత్రుల్లో భాగంగా మహిళలు ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

కంచికచర్ల, న్యూస్‌టుడే : దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకొని దసరా ఉత్సవాలు సందడిగా సాగుతున్నాయి. కంచికచర్ల శివారు శివసాయి క్షేత్రంలో అమ్మవారిని గాయత్రి దేవిగా అలంకరించగా, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో లలితా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అమ్మవారికి పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించారు.


జగ్గయ్యపేట: బ్రహ్మం గారి గుడి వద్ద


పెనుగంచిప్రోలు డౌన్ సెంటర్‌లో..


కంచికచర్ల: మిక్ ఇంజినీరింగ్ కళాశాలలో..


పెనుగంచిప్రోలు డౌన్‌సెంటర్‌లో పూజల్లో మహిళలు

విద్యుత్తు శాఖ నిర్లక్ష్యంతో పైపులైన్ ధ్వంసం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పల్లగిరి గ్రామం వద్ద విద్యుత్తు శాఖ సిబ్బంది నిర్లక్ష్యంతో తాగునీటి పైపులైన్ పగిలింది. ఇటీవల ఆ శాఖ పల్లగిరి నుంచి కొత్తూరు వరకు ఆర్‌అండ్‌బీ రహదారి వెంట నూతనంగా విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేశారు. ఆ క్రమంలో యంత్రంతో గుంతలు తీయడంతో తాగునీటి పైపులైన్ పలు చోట్ల పగిలి నీటి సరఫరాకు విఘాతం ఏర్పడింది. దీంతో గ్రామ సచివాలయ కార్యదర్శి బాలకృష్ణ సిబ్బందితో గుంతలు తీసి పైపులైన్‌కు మరమ్మతులు చేయిస్తున్నారు.


పైపులైన్ మరమ్మతు కోసం తవ్విన గుంత

శివాపురానికి తాగునీటి సరఫరా పునరుద్ధరణ

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: మండలంలోని శివాపురం గ్రామానికి తాగునీటి సరఫరాను పునరుద్ధరణ చేసినట్లు సర్పంచి తేళ్ల లక్ష్మణరావు తెలిపారు. ఇటీవల మునేరుకు వచ్చిన వరదకు పెనుగంచిప్రోలు వద్ద ఉన్న పంపు హౌస్ దెబ్బతింది. మరమ్మతులు చేసిన కొన్ని రోజులకే మరో సారి ట్రాన్స్‌ఫారమ్, మోటార్లు కాలిపోయాయి. గత రెండు రోజులుగా మరమ్మతులు చేపట్టిన పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సోమవారం పనులు పూర్తిచేసి నీటి సరఫరాను పునరుద్ధరణ చేయటంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


పంపు హౌస్ వద్ద సిబ్బంది మరమ్మతులు

వడ్డె ఓబన్న వర్ధంతి

కంచికచర్ల, న్యూస్‌టుడే : స్వాతంత్ర్య పోరాటంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి సర్వ సైన్యాధ్యక్షుడిగా వడ్డె ఓబన్న ఎనలేని పాత్ర పోషించారని వడ్డెర సంఘ నాయకులు అన్నారు. కంచికచర్ల ఇందిరా కాలనీలో వడ్డెర సంఘం ఆధ్వర్యంలో వడ్డె ఓబన్న వర్ధంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. ఓబన్న విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.


ఓబన్న విగ్రహం వద్ద నాయకుల నివాళి

దరఖాస్తుల వెల్లువ



ఎక్సైజ్ కార్యాలయంలో వరుసలో దరఖాస్తుదారులు

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. నందిగామ, చందర్లపాడు, పెనుగంచిప్రోలు మండలాల్లో 16 మద్యం దుకాణాలకు నేరుగా ఎక్సైజ్ సీఐ బంగార్రాజుకు 120 దరఖాస్తులు అందజేశారు. ఆన్‌లైన్లో ఇంకా అదనంగా దరఖాస్తు చేశారని సీఐ చెప్పారు. ఈనెల 9న సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగుస్తుందన్నారు.

కంచికచర్ల, న్యూస్‌టుడే : మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ప్రక్రియకు ఈ నెల 9 వ తేదీతో గడువు ముగుస్తుందని కంచికచర్ల ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ అష్రాఫున్నీసా బేగం సోమవారం తెలిపారు.

విద్యార్థులకు అవగాహన

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం సామాజిక విజ్ఞాన కళాశాల చివరి ఏడాది చదువుతున్న 8 మంది విద్యార్థులకు గ్రామీణ అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కేవీల్ రావు కృషి విజ్ఞాన కేంద్ర దత్తత గ్రామాలైన బలుసుపాడు, గరికపాడు, తక్కెళ్ళపాడు కేటాయించారు. 11 వారాల కార్యక్రమంలో చివరి దశలో భాగంగా తక్కెళ్లపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి కె. శ్రీనివాసరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కృష్ణంరాజు, ఎస్ఎంఎస్ ప్రభావతి, కళాశాల సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.


ఆహార ఉత్పత్తుల గురించి గ్రామస్థులకు వివరిస్తున్న విద్యార్థులు

ఇసుక అక్రమంగా తరలిస్తున్న వాహనాల స్వాధీనం


పట్టుబడిన లారీ, టిప్పర్

నందిగామ, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలు మండలం శనగపాడు మునేటి నుంచి హైదరాబాద్‌కు ఇసుక అక్రమంగా తరలిస్తున్న వాహనాలను ఆదివారం రాత్రి నందిగామ పోలీసులు పట్టుకున్నారు. సీఐ వైవీఎల్ నాయుడుకు అందిన సమాచారంతో సిబ్బంది నందిగామ వద్ద నిఘా పెట్టడంతో ఇసుక తరలిస్తున్న మూడు లారీలు, ట్రాక్టరు, వీటిని అనుసరిస్తున్న రెండు కార్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

విజయవాడ పశ్చిమ

కుంకుమార్చన క్యూ మార్గంలో మార్పు

ఈనాడు స్పందన

చిట్టినగర్, న్యూస్‌టుడే: ఆర్జిత సేవలకు వచ్చే భక్తులను టికెట్ తనిఖీ పేరుతో పోలీసులు అడ్డుకుంటూ ఇబ్బంది పెడుతున్న నేపథ్యంలో 'ఆర్జిత సేవల భక్తులకు అడ్డంకులు' శీర్షికన ఈ నెల 7న తేదీన 'ఈనాడు' 12వ పేజీలో కథనం ప్రచురితమైంది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించారు. పూజలకు వచ్చే భక్తులను ఎక్కడా అడ్డుకోకుండా త్వరితగతిన కొండపైకి పంపించే విధంగా చర్యలు తీసుకున్నారు. చిన్న రాజగోపురం వద్ద నుంచి గతంలో ఏర్పాటు చేసిన కుంకుమార్చన మార్గాన్ని మార్పు చేశారు. దుర్గగుడి ఈవో పేషీకి వెళ్లే మార్గం నుంచి కుంకుమార్చనకు, ఇతర ఆర్జిత సేవలకు భక్తులను పంపడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


ఈవో పేషీకి వెళ్లే మార్గంలో ఆర్జిత సేవల భక్తులు ఇలా..

9 నుంచి రాష్ట్ర స్థాయి ఆహ్వాన కబడ్డీ టోర్నీ

విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే: మంగళగిరిలోని గౌతమబుద్ధ రోడ్డులో బీఎండబ్ల్యూ షోరూం పక్కన ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి ఆహ్వాన స్త్రీ, పురుషుల కబడ్డీ టోర్నీని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని రాష్ట్ర కబడ్డీ సంఘం కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ తెలిపారు. 'మంగళగిరి కబడ్డీ లీగ్-2024' పేరుతో నిర్వహిస్తున్న ఈ టోర్నీలో రాష్ట్రంలోని అత్యుత్తమ ప్రతిభగల 13 పురుషుల, ఎనిమిది మహిళల జట్లు పాల్గొంటాయని ఆయన పేర్కొన్నారు.

అమ్మా భవానీ.. దుర్గా భవానీ

అమ్మ సన్నిధికి భక్తుల రాక

చిట్టినగర్, న్యూస్‌టుడే

దేవీశరన్నవరాత్రుల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు భవానీ భక్తులు తరలి వస్తున్నారు. దసరా ఉత్సవాల సందర్భంగా భవానీలు 21 రోజులు, కొందరు 11 రోజులు దీక్షలు చేపట్టారు. దీక్ష విరమణ చేసేందుకు వివిధ ప్రాంతాల నుంచి ఇంద్రకీలాద్రికి చేరుకుంటున్నారు. జైభవానీ.. జైజై భవానీ, అమ్మా దుర్గా.. తల్లీ దుర్గా అంటూ అమ్మ నామస్మరణతో అమ్మ సన్నిధికి చేరుకుని ఆ జగన్మాత దివ్య రూపాన్ని చూసి తరిస్తున్నారు. అనంతరం దీక్ష విరమించి మొక్కులు తీర్చుకుంటున్నారు. దసరా ఏర్పాట్లు, క్యూలైన్లు, అన్నప్రసాదం తదితర విషయాలపై భవానీ భక్తులు తమ మనోభావాలను 'న్యూస్‌టుడే'తో ఇలా పంచుకున్నారు.



పాదయాత్ర చేసుకుంటూ వచ్చాం - సంపత్, ఖమ్మం



మేం పదమంది భవానీ భక్తులం కలిసి తెలంగాణ రాష్ట్రం ఖమ్మం నుంచి పాదయాత్ర చేసుకుంటూ వచ్చాం. ఎలాంటి ఆటంకాలు లేకుండా మా యాత్ర సాగింది. క్యూమార్గంలో అమ్మ సన్నిధికి చేరుకుని మహాచండీ అలంకారంలో కొలువైన దుర్గమ్మను దర్శించుకున్నాం. మొక్కులు తీర్చుకుని అన్నప్రసాదం స్వీకరించాం. గతంతో పోలిస్తే ఏర్పాట్లు బాగున్నాయి.

ఆలయాన్ని బాగా అలంకరించారు - రాంబాబు, మండపేట



మా కుటుంబంతో కలిసి మండపేట నుంచి వచ్చాం. పవిత్ర కృష్ణానదిలో స్నానమాచరించి క్యూ మార్గంలో కొండకు చేరుకున్నాం. అరగంటలో దర్శనం పూర్తయింది. మొక్కులు తీర్చుకున్నాం. ఆలయం ఎంతో శోభాయమానంగా అలంకరించారు. అమ్మ ప్రసాదం చాలా రుచికరంగా ఉంది. కావాల్సినన్ని లడ్డూలను ప్రసాదాలు కౌంటర్లలో తీసుకున్నాం. ఏర్పాట్లు చాలా బాగున్నాయి.

సౌకర్యాలు బాగున్నాయి - ఊర్మిళ, రాజమహేంద్రవరం



భవానీ దీక్ష చేపట్టి అమ్మ సన్నిధికి వచ్చాం. గత ఏడాది భవానీ దీక్షల సమయంలో వచ్చి ఆ తల్లి దర్శించుకుని మా ఇబ్బందులు చెప్పుకొన్నాం. మా ఇబ్బందులు తీరాయి. అనుకున్నది జరిగింది. దసరా ఉత్సవాల్లో వచ్చి అమ్మ దర్శనం చేసుకున్నాను. అమ్మవారి నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం బాగుంది. క్యూలైన్లలో ఏర్పాట్లు బాగా చేశారు. తాగునీరు వంటివి ఎక్కడికక్కడే అందిస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ కూడా గతంకంటే మెరుగ్గా ఉంది.

గతం కంటే మిన్నగా.. - సురేష్‌రెడ్డి, ఉదయ్‌భాస్కర్, రావులపాలెం



ప్రతి ఏటా దసరా ఉత్సవాలకు అమ్మ దీక్ష చేపట్టి మొక్కులు తీర్చుకునేందుకు ఇంద్రకీలాద్రికి వస్తాం. ఇప్పటికి 11 సార్లు దీక్ష చేపట్టి జగన్మాత చెంతకు వచ్చాం. క్యూ మార్గంలో కొండకు చేరుకున్నాం. ఎండ తీవ్రత వల్ల దాహార్తి తీర్చేందుకు అడుగడుగునా తాగునీరు అందించిన తీరు చాలా బాగుంది. గతం కంటే మిన్నగా ఏర్పాట్లు చేశారు. దర్శనం కూడా చాలా సులువుగా 45 నిముషాల్లో అయింది. చాలా సంతోషంగా తిరిగి వెళుతున్నాం.

కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం, న్యూస్‌టుడే: విజయవాడను కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. నగర పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పచ్చదనం, నగర సుందరీకరణ, కాలుష్య నియంత్రణకు సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల వంటి అభివృద్ధి చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మొక్కలను నాటడం ద్వారా కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. నగరంలో అనధికారిక నిర్మాణాలు జరగకుండా చూడాలని, ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ డి.చంద్రశేఖర్, సిటీ ప్లానర్ ప్రసాద్, ఆరోగ్య అధికారి పి.రత్నావళీ, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కానిస్టేబుల్‌కు ఆర్థిక సాయం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న విజయవాడ ఆర్పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ పి.సుధాకరరావుకు సిబ్బంది బాసటగా నిలిచారు. సుధాకరరావు ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని సీనియర్ డీఎస్పీ వల్లేశ్వరరావు సూచన మేరకు సిబ్బంది రూ.1.43లక్షలు సేకరించి సోమవారం బాధితుడి కుటుంబసభ్యులకు అందజేశారు.

భక్తులకు మొక్కల పంపిణీ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దసరా వేడుకల్లో దుర్గమ్మ దర్శనానికి వచ్చిన భక్తులకు ఓ రైతు తులసి, ఉసిరి తదితర మొక్కలు పంచారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కడియం ప్రాంతానికి చెందిన ఓ నర్సరీ యజమాని ఇంద్రకీలాద్రిపై భక్తులకు మొక్కలు పంచుతానని మొక్కుకున్నారు. ఈ మేరకు ఆయన దుర్గమ్మ ఆలయ ఈవో రామారావును కలిసి తన మొక్కు గురించి వివరించారు. ఆయన అంగీకరించడంతో సదరు రైతు లారీలో మొక్కలు తీసుకువచ్చి భక్తులకు అందజేశారు.

కుంకుమార్చన సేవలో ప్రముఖులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: మల్లికార్జున మహామండపం ఆరో అంతస్తులో సోమవారం నిర్వహించిన కుంకుమార్చనలో నందమూరి హరికృష్ణ కుమార్తె సుహాసిని పాల్గొన్నారు. అనంతరం ఆమెకు అధికారులు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించి ప్రసాదాలు అందజేశారు.

☛ మహాచండీదేవి ఆలంకారంలో ఉన్న దుర్గమ్మను గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. అధికారులు వారికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.


కుంకుమార్చన సేవలో నందమూరి హరికృష్ణ కుమార్తె సుహాసిని


యార్లగడ్డ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న వేదపండితుడు

'దురుద్దేశంతోనే పాలస్తీనాపై దాడులు'

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: ఒక జాతిని అంతం చేయాలనే దురుద్దేశంతోనే పాలస్తీనాపై దాడి చేసి.. వేలాది మందిని ఇజ్రాయెల్ పొట్టనబెట్టుకుందని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సి.హెచ్.బాబూరావు అన్నారు. అదొక టెర్రరిస్టు దేశమని ఆరోపించారు. 'గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఆపాలి. పాలస్తీనాకు సంఘీభావం' అనే అంశంపై వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం బాలోత్సవ్ భవన్‌లో సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అధికారికంగా 45వేల మంది చనిపోయారని చెబుతున్నారని, వీరిలో 16వేల మంది చిన్నారులేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయిల్‌పై పట్టు సంపాదిస్తే.. ప్రపంచాన్ని తమ గుప్పెట్లో పెట్టుకోవాలనే ఉద్దేశంతోనే ఇజ్రాయెల్ పేరుతో అమెరికా యుద్ధం చేస్తోందన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి సీనియర్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్

విజయవాడ క్రీడలు: గుంటూరు జిల్లా నాగార్జున నగర్‌లోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఈ నెల 8 నుంచి నాలుగు రోజులు రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ నిర్వహిస్తామని రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి ఎం.డానియేల్ ప్రదీప్ తెలిపారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన పురుషుల జట్లు పాల్గొంటాయన్నారు. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో జరిగే ఈ ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభగల క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తామన్నారు.

కాళ్లు కాలుతున్నాయ్.. కనికరించరూ


మల్లికార్జునస్వామి మెట్ల మార్గం ద్వారా దిగుతున్న భక్తులు..

దసరా శరన్నవరాత్రుల్లో దుర్గమ్మ దర్శనానికి భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. క్యూలైన్‌లు, షెడ్‌లు, కార్పెట్ రక్షణలో భద్రంగా వస్తున్నారు. దర్శనం అనంతరం మల్లికార్జునస్వామి మెట్ల మార్గంలో దిగి వెళ్లేటప్పుడు మాత్రం రాతి గచ్చుపై ఎండలో నడిచి వెళ్తున్నారు. రక్షణగా పెయింట్, కార్పెట్ ఏమీలేకపోవడంతో కాళ్లు కాలుతున్నాయి. దీంతో భక్తులు పరుగులు తీస్తున్నారు. మిగిలిన ప్రాంతంలో కార్పెట్‌తో రక్షణ ఏర్పాట్లు చేసినా.. ఈ ప్రాంతాన్ని మరచిపోయారని, సమస్యగా ఉందని భక్తులు వాపోతున్నారు. అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

- ఈనాడు,అమరావతి

ప్రొటోకాల్ పాటించరా?

కారు ఆపడంపై మేయర్ భాగ్యలక్ష్మి ఆగ్రహం

విద్యాధరపురం, న్యూస్‌టుడే: ప్రొటోకాల్ ఉన్నా కారును ఆపడమే కాకుండా దుర్గమ్మ దర్శనానికి వస్తే అవమానకరంగా వ్యవహరించిన పోలీసులపై నగర మేయర్ భాగ్యలక్ష్మి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహాచండీదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్న తరువాత ఆమె విలేకరులతో మాట్లాడారు. దసరా వేడుకల్లో ప్రొటోకాల్ పేరుతో అనర్హులు దర్శనానికి వస్తుంటే పట్టించుకోని పోలీసులు నగర ప్రథమ పౌరురాలన్న గౌరవం లేకుండా ఘాట్ రోడ్డులో అవమానించారన్నారు. దసరా ఉత్సవాల్లో మున్సిపల్ సిబ్బంది కూడా సేవలు అందిస్తున్నారన్న విషయాన్ని అధికారులు గుర్తు పెట్టుకోవాలన్నారు. తమ సిబ్బంది పారిశుద్ధ్యం, ఘాట్ల వద్ద విధులు నిర్వహిస్తున్నారని, వారు చేయకుంటే ఆపని ఎవరు చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్న అధికారులు ప్రొటోకాల్ ఉన్న వారితో మర్యాదగా వ్యవహరించాలన్నారు.

ఆది దంపతులకు నృత్య నీరాజనం


కేరళ వాయిద్యకారుల ఉత్సాహం



ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా గంగా, పార్వతీ సమేత దుర్గామల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవమూర్తులను అలంకరించిన పల్లకీలో ఉంచి పూజలు చేశారు. కనకదుర్గానగర్‌లో సోమవారం సాయంత్రం మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో ఆదిదంపతులకు నగరోత్సవం నిర్వహించారు. అమ్మవారి దర్శనం చేసుకున్న భక్తులు ఆదిదంపతులను దర్శించుకున్నారు. దేవస్థానం ఉద్యోగులతోపాటు పోలీసు సిబ్బంది పల్లకీ సేవ చేసేందుకు పోటీపడ్డారు. విజయవాడ భవనీపురం, పీఠాపురం, గుంటూరు పట్టణాల నుంచి వచ్చిన నృత్య కళాకారులు పూజ్యశ్రీ, శృతి, సౌమ్య, లక్ష్మి తదితరులు నృత్యంతో దుర్గమ్మను కీర్తించారు.


లలితా త్రిపురసుందరీదేవిగా చిట్టినగర్ అమ్మవారు


పాలఫ్యాక్టరీ వద్ద ఆలయంలో పార్వతీదేవిగా


వీఎంసీ కాలనీలో


దాసాంజనేయస్వామి ఆలయంలో..


కొత్తపేట గంగానమ్మ ఆలయంలో..


క్వారీ సెంటరులో పూజలు అందుకున్న మహాచండి అమ్మవారు


అలరించిన కూచిపూడి నృత్యం

త్రిశక్తి రూపిణి.. దుష్ట సంహారిణి


హారతులు అందుకుంటున్న భక్తులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: దసరా వేడుకలను పలు ఆలయాల్లో వైభవంగా నిర్వహిస్తున్నారు. చిట్టినగర్‌లోని కొత్త అమ్మవారి ఆలయంలో అమ్మవారు లలితా త్రిపురసుందరీదేవిగా భక్తులు దర్శించుకున్నారు. పాలఫ్యాక్టరీ వద్ద విజయదుర్గ ఆలయంలో పార్వతీదేవిగా దర్శనమిచ్చారు. భీమనవారిపేట గంగానమ్మగుడిలో, వీఎంసీ కాలనీలోని కనకదుర్గ, కేబీఎన్ కళాశాల ప్రాంగణంలోని దాసాంజనేయ స్వామి, కొత్తపేట గంగానమ్మ అమ్మవారి ఆలయాల్లో, వన్‌టౌన్ పోలీసు స్టేషను ప్రాంగణంలో క్వారీ సెంటరు సమీపంలో కనకదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో మహాచండీదేవిగా అలంకరించి పూజలు చేశారు.


వన్‌టౌన్ పోలీసుస్టేషనులో చండీదేవి అలంకారంలో దుర్గామాతకు పూజ చేస్తున్న పోలీసు సిబ్బంది

ఆయుర్వేద వైద్య సేవలు విస్తృతం

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే: ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా గత వంద రోజుల్లో దేశంలోని అన్ని ప్రాంతాలకు ఆయుర్వేద వైద్య సేవలు చేరువ చేసినట్లు విజయవాడ ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధనా సంస్థ సహాయ సంచాలకులు (ఇన్‌ఛార్జి) డాక్టర్ బండి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. వైద్య రంగాన్ని కొత్త పుంతలు తొక్కించేందుకు ప్రపంచంలోని వైద్య విశ్వవిద్యాలయాలు, ఆరోగ్య సంస్థలు, దేశాలతో ఒప్పందాలు చేసుకుంటున్నట్లు తెలిపారు. సోమవారం రాజీవ్‌నగర్‌లోని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధనా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని వేడుకున్నాం

చిట్టినగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని, ప్రజలంతా సుఖశాంతులతో జీవనం సాగించేలా అమ్మ ఆశీస్సులు ఎప్పుడూ ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు విజయవాడ మధ్య నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరావు తెలిపారు. దేవీశరన్నవరాత్రుల ఉత్సవాలలో సోమవారం మహాచండీదేవి లంకారంలో ఉన్న జగన్మాతను ఎమ్మెల్యే కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం దిశగా ముందుకు సాగేందుకు శక్తియుక్తులు ప్రసాదించాలని కోరుకున్నట్లు వివరించారు. దసరా ఏర్పాట్లు చాలా బాగున్నాయన్నారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అమ్మవారిని దర్శించుకునేందుకు చక్కటి సౌకర్యాలు కల్పించారన్నారు.


అమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే ఉమామహేశ్వరరావు కుటుంబసభ్యులు

నిత్యావసర సరకుల పంపిణీ

విజయవాడ బస్‌స్టేషన్, న్యూస్‌టుడే: ఇటీవల విజయవాడ పరిసర ప్రాంతాల్లో సంభవించిన వరదల కారణంగా సర్వం కోల్పోయిన ఆర్టీసీ ఒప్పంద పారిశుద్ధ్య కార్మికులు 130 మందికి ఒక్కోటి రూ.1500 విలువైన నిత్యావసరాల కిట్‌లను ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, వైస్ ఛైర్మన్ పి.ఎస్. మునిరత్నం చేతులమీదుగా అందించారు. ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో, ఆర్టీసీ హౌస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్, ఆర్టీసీ ఉన్నతాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.


వరద బాధితులకు కిట్లు అందజేస్తున్న ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, వైస్ ఛైర్మన్ పి.ఎస్. మునిరత్నంలు

పీసీపీవోకు పలువురు అభినందనలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ అధికారి(పీసీపీవో)గా సోమవారం బాధ్యతలు స్వీకరించిన జి.ఆర్.ఎస్.రావుకు పలువురు అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. 2005లో ఏపీవోగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన ఆయన వివిధ డివిజన్లలో సమర్థంగా విధులు నిర్వహించి ఎటువంటి రిమార్కు లేకుండా పీసీపీవో స్థాయికి ఎదగడం అభినందనీయమని రైల్వే డిప్యూటీ చీఫ్ పర్సనల్ అధికారి ముత్యాల బాలమురళీధర్ కొనియాడారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న బాలమురళీధర్

ఇంద్రకీలాద్రిపై ఏర్పాట్లు భేష్

చిట్టినగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు అమ్మ అండగా ఉండాలని వేడుకున్నట్లు దివంగత సినీ హీరో కృష్ణంరాజు సతీమణి శ్యామలదేవి తెలిపారు. దేవీశరన్నవరాత్రుల ఉత్సవాల్లో మహాచండీదేవి అలంకారంలో ఉన్న దుర్గమ్మను ఆమె సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియా పాయింటు వద్ద మాట్లాడుతూ దుర్గమ్మ అంటే కృష్ణంరాజుకు చాలా ఇష్టమన్నారు. ప్రతి ఏటా ఆలయానికి వచ్చి పూజలు నిర్వహించే వారమన్నారు. అమ్మవారి దర్శనానికి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఏర్పాట్లు బాగున్నాయన్నారు. ప్రస్తుతం తాను రాజకీయాల్లోనే ఉన్నానని, పార్టీ ఏ పదవి ఇచ్చినా నిర్వహిస్తానని చెప్పారు.


మాట్లాడుతున్న సినీహీరో కృష్ణంరాజు సతీమణి శ్యామలదేవి, పక్కన భాజపా నాయకులు

త్రుటిలో తప్పిన ప్రమాదం

ఆగిఉన్న లారీని ఢీకొని పొదల్లోకి దూసుకెళ్లిన వాహనం

తల్లాడ, న్యూస్‌టుడే: ఆర్టీసీ విజిలెన్స్ అధికారులకు త్రుటిలో ప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి. ఆర్టీసీ బస్సుల్లో పొరుగు రాష్ట్రాలకు మద్యం సరఫరా అవుతుందనే సమాచారంతో ఏపీ విజయవాడకు చెందిన విజిలెన్స్ అధికారులు ఖమ్మం జిల్లా తల్లాడ రింగురోడ్డు కూడలిలో సోమవారం బస్సులను తనిఖీ చేశారు. అనంతరం బొలెరో వాహనంలో కల్లూరు వైపు బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న వాహనం తల్లాడ సమీపంలోని ఎన్టీఆర్ నగర్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొని అదుపుతప్పి పొదల్లోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో వాహనంలో ప్రయాణిస్తున్న ఆర్టీసీ విజిలెన్స్ అధికారులు బి.వెంకటేశ్వర్లు, పి.శ్రీనివాసరావు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వాహనాన్ని ట్రాక్టర్ సాయంతో బయటకు తీశారు.

నేటి నుంచి జాతీయ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నగరంలోని సీహెచ్ఆర్‌కే వీఎంసీ, ఎస్ఎస్‌బీఏ ఇండోర్ స్టేడియాల్లో ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు 'యోనెక్స్ సన్‌రైజ్ కలగర నాగబాబు స్మారక ఆలిండియా సబ్ జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నీ-2024' నిర్వహిస్తామని రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి, శాప్ మాజీ ఛైర్మన్ పోలినేని అంకమ్మచౌదరి తెలిపారు. ఈ నెల 4 నుంచి జరిగిన క్వాలిఫైయింగ్ రౌండ్స్ సోమవారం ముగిశాయి. క్వాలిఫైయింగ్ రౌండ్స్ నుంచి అండర్-15, 17 బాలబాలికల సింగిల్స్‌లో 32 మంది షట్లర్ల చొప్పున, డబుల్స్, మిక్స్‌డ్‌లో 16 జట్ల చొప్పున మెయిన్ డ్రాకు అర్హత సాధించాయి. సోమవారం జరిగిన క్వాలిఫైయింగ్ ఫైనల్ రౌండ్‌లో పలువురు షట్లర్లు హోరాహోరీగా తలపడ్డారు. అండర్-15 బాలుర విభాగంలో ఎస్.హేమంత్‌శ్రీ, సీహెచ్ విజయ్ చరణ్, బాలికల విభాగంలో ఆర్.లక్ష్మీ సాయి ఆరాధ్య, ఎం.దీవెన రాణి, జి.సుష్మారెడ్డి, డి.ధన్య సంజన, ఎస్.మనస్విలు మెయిన్ డ్రాకు రాష్ట్ర నుంచి అర్హత సాధించారు. అండర్-17 బాలుర విభాగంలో డి.శేఖర శతమన్యు, కె.సాయి సాహిల్, కె.శ్రీకర వెంకట ప్రణీత్, వి.హరికృష్ణ, కె.రాహుల్, బాలికల విభాగంలో ఆర్.లక్ష్మీ సాయి ఆరాధ్య, బి.విజయలక్ష్మి, రేణుశ్రీ, కె.గగన శ్రీచౌదరి, జి.సుష్మారెడ్డిలు రాష్ట్రం నుంచి మెయిన్ డ్రాకు అర్హత సాధించారని అంకమ్మచౌదరి చెప్పారు.


అండర్-15 బాలుర విభాగంలో మెయిన్ డ్రాకు అర్హత సాధించిన హేమంత్‌శ్రీ (ఏపీ)

బాలికపై యువకుడి అత్యాచార యత్నం

కృష్ణలంక, న్యూస్‌టుడే: మద్యం మత్తులో బాలికపై యువకుడు అత్యాచారానికి యత్నించిన ఘటన విజయవాడ రాజీవ్‌గాంధీ పూలమార్కెట్ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జి.కొండూరు మండలం చెవుటూరుకు చెందిన సుబ్రహ్మణ్యం(22) మద్యం సేవించి ఆకతాయిగా సంచరిస్తూ ఉంటాడు. వన్‌టౌన్‌కు చెందిన ఓ మహిళ కెనాల్ రోడ్డు వినాయకుడి గుడి సమీపంలో చిరు వ్యాపారం చేస్తుంది. ఆదివారం ఆమె వెంట కుమార్తె(13) కూడా వచ్చింది. రాత్రి సుమారు 8 గంటల సమయంలో అక్కడకు చేరుకున్న యువకుడు ఆ బాలికను తీసుకుని రాజీవ్‌గాంధీ పూలమార్కెట్ సమీపంలోని రైల్వే ట్రాక్ వైపునకు వెళుతుండడాన్ని అక్కడే ఉన్న ముఠా కార్మికులు గుర్తించారు. కొద్దిసేపటికి బాలిక కేకలు వేయడాన్ని గమనించి వారు సమీపంలో దసరా బందోబస్తు విధుల్లో ఉన్న ఆర్ఎస్ఐ ఫజుల్లాబేగ్‌కు సమాచారం అందించారు. కానిస్టేబుల్ రాజును వెంటబెట్టుకుని ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోక్సో చట్టంపై కేసు నమోదు చేసిన పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

విజయవాడ మధ్య

విద్యుత్తు దీపం ఏర్పాటు

సీతారాంపురం, న్యూస్‌టుడే : బందరు లాకులు సాయిబాబా గుడి వద్ద.. గోపాలకృష్ణయ్య వీధిలో 23/98/24 నంబరు విద్యుత్తు స్తంభం దీపం నెల రోజులుగా వెలగడం లేదు. స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా..' దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఈ నెల 5న 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. వీఎంసీ ఏఈ విమల స్పందించి.. తమ సిబ్బందితో దీపం ఏర్పాటు చేయించారు.



సామూహిక కుంకుమ పూజలు

సత్యనారాయణపురం, న్యూస్‌టుడే : శరన్నవరాత్రి మహోత్సవాలు పురస్కరించుకుని సత్యనారాయణపురంలోని గాయత్రి కల్యాణ మండప ప్రాంగణంలో శ్రీదేవి సాంస్కృతిక సాంఘిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం సామూహిక కుంకుమ పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సతీమణి సుజాత మాట్లాడుతూ.. తెలుగు వారి సంస్కృతి సంప్రదాయాలు, ఆధ్యాత్మికతను యువతరానికి అలవాటు చేస్తున్న నిర్వాహకురాలు శ్రీదేవిని అభినందించారు.

తైక్వాండోలో సత్తా

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : చుట్టుగుంటలోని శ్రీచైతన్య కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న యు.శ్యామ్‌కుమార్ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ తైక్వాండో పోటీల్లో సత్తా చాటాడని డీన్ హరిబాబు తెలిపారు. కడప జిల్లా రైల్వే కోడూరులో ఈ నెల 4, 5వ తేదీల్లో పోటీలు నిర్వహించారు. ఇందులో ద్వితీయ స్థానం సాధించాడని పేర్కొన్నారు. అతడితోపాటు కోచ్ గౌరీ శంకర్‌ను ప్రిన్సిపల్ నిజాంపట్నం గోకర్ణేశ్వరరావు, ఏజీఎం కొమ్మినేని రంగారావు, జిల్లా తైక్వాండో సంఘం కార్యదర్శి ఎం.అంకమ్మరావులు అభినందించారు.

వాకింగ్ ట్రాక్‌కు మరమ్మతులు



పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే : బుడమేరు వరదల కారణంగా నూజివీడు రోడ్డులో వాకింగ్ ట్రాక్ కుంగిపోయింది. రాజీవ్‌నగర్, కండ్రిక పరిసరాల్లో పరిస్థితులపై ఈ నెల 6వ తేదీన 'నడిచే మార్గం లేదాయే' శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ట్రాక్‌లో కుంగిపోయిన పేవర్ బ్లాక్‌ను తీసి, వాటికి సిమెంటు పెట్టి మళ్లీ సరిచేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నడకదారులకు ఉపయోగపడేలా ట్రాక్‌ను సరిచేస్తుండటంపై స్థానికులు హర్షం వ్యక్తంచేశారు.

ఆక్రమణలకు అండదండలు!


- అధికారుల చర్యలు నామమాత్రం
- ప్రజాప్రతినిధుల తీరు వివాదాస్పదం

బుడమేరు వరద బీభత్సం.. ఇప్పటికీ కళ్లముందు మెదులాడుతూనే ఉంది. ఆక్రమణలపై ఫిర్యాదులొస్తే.. కఠినంగా వ్యవహరించాల్సిన అధికారులు మమ అనిపిస్తున్నారు. కంటితుడుపు చర్యలు తీసుకుంటున్నారు. కొందరు నాయకులు అక్కడికి వెళ్లి అభయహస్తం ఇస్తున్నారు. ఆక్రమితదారులకు అండగా నిలవడం శోచనీయం.

పట్టించుకోని ప్రణాళికా దళం

విజయవాడ, న్యూస్‌టుడే

లెనిన్ కూడలిలో తొలగించిన పూలకొట్లు.. అధికారుల నిర్లక్ష్యం కారణంగా 15 రోజుల కాకముందే మళ్లీ తిష్ట వేస్తున్నాయి. గత నెలలో ఇక్కడ అగ్నిప్రమాదం జరగ్గా.. కొట్లు తొలగించారు. మట్టి దిబ్బలను కొంత మేర మాత్రమే తొలగించారు. తర్వాత పట్టించుకోకపోవడంతో.. ఇదే ప్రదేశంలో మళ్లీ ఆక్రమణలు వెలుస్తున్నాయి. ప్రస్తుతం తోపుడు బండ్లు పెట్టి వ్యాపారం చేస్తున్నారు. క్రమక్రమంగా షెడ్ వేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. రెండు వంతెనల మధ్య ఖాళీ స్థలంలో వెలిసిన ఈ దుకాణాలతో.. ట్రాఫిక్ సమస్య తలెత్తే అవకాశం ఉంది. దుకాణాల వల్ల గతంలో సీసీ కెమెరాల స్తంభాలను రోడ్డు మీద వేయాల్సి వచ్చింది. ఇప్పుడవి రోడ్డులోకి వచ్చేశాయి. దుకాణాలు తొలగించగానే.. రాజకీయ నాయకులు రంగంలోకి దిగిపోయారు. ఆక్రమణదారులకు వత్తాసు పలుకుతూ.. అధికారులపై ఒత్తిడి పెంచుతున్నారు.



గత నెల 22న ఖాళీగా ఇలా..



15 రోజులు కాక ముందే పక్కాగా వెలిసిన ఆక్రమణలు

పట్టణ ప్రణాళిక సిబ్బంది నిర్లక్ష్యం

ఆక్రమణలను తొలగించే క్రమంలో పట్టణ ప్రణాళికాధికారులు తీసుకుంటున్న చర్యలు వివాదాస్పదమవుతున్నాయి. ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించే ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాల్సిన వారే నిర్లక్ష్యం వహిస్తున్నారు. మొక్కుబడిగా కొంత వరకు తొలగించి ఊరుకుంటున్నారు. వారం పది రోజులు దాటగానే.. మరలా అదే ప్రాంతంలో రాజకీయ నాయకుల అండదండలతో వ్యాపారులు తిష్టవేస్తున్నారు. ఫలితంగా సమస్య మొదటికి వస్తోంది. గత నెల 23న లెనిన్ కూడలిలోని పూలకొట్లను తొలగించారు. కొద్దిరోజులు గడిచాక.. మళ్లీ ఆక్రమణలు వెలుస్తున్నాయి.

అదును చూసి.. మాటువేసి

అయోధ్యనగర్(సత్యనారాయణపురం), న్యూస్‌టుడే

స్థానిక 32వ డివిజన్ పరిధిలో బుడమేరు కట్ట, నూజివీడు ప్రధాన రహదార్ల పక్కన విచ్చలవిడిగా ఆక్రమణలు కొనసాగుతున్నాయి. వీటిని నిలువరించాల్సిన పట్టణ ప్రణాళికా విభాగం వారు, ప్రజాప్రతినిధులు.. తమకేమీ పట్టనట్లు ఊరుకున్నారు. గత నెల 23న 'ఆక్రమణలకు అడ్డు లేదా?' శీర్షికతో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు నూజివీడు ప్రధాన రహదారిలోని అన్న క్యాంటీన్ సమీపాన వేసిన షెడ్లను తొలగించారు. అప్పట్లో రేకులను తొలగించి, సిమెంటు స్తంభాలను వదిలేశారు. ఆక్రమ కట్టడాన్ని పాక్షికంగానే ధ్వంసం చేశారు. దీనిపై మరో వార్త ప్రచురితమైంది. నెల గడవకముందే అదే షెడ్డు అన్ని హంగులతో రూపుదిద్దుకుంది. కొత్తగా బోరు వేశారు. ఇదే అదనుగా భావించిన మరికొందరు.. కట్టను ఆక్రమించుకుని షెడ్లు వేస్తున్నారు.

విలువైన స్థలంలో..

అన్న క్యాంటీన్‌ను ఆనుకుని ఉన్న సుమారు 500కు పైగా గజాల స్థలంలో నర్సరీకి అనుమతులిచ్చారు. ఇది వైకాపా పాలనలోనే ఏర్పాటైంది. కొత్తపేటకు చెందిన ఒక వ్యాపారి నర్సరీ పెట్టినట్లు తెలిసింది. వీటిపై 32వ డివిజన్ కార్పొరేటర్ చెన్నగిరి రామమోహనరావును వివరణ కోరగా.. ఆక్రమణలపై ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, పట్టణ ప్రణాళికా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. స్థానికులు ఎవరూ ఆక్రమించడం లేదని, ఇతర ప్రాంతాలవారు వచ్చి ఆక్రమిస్తున్నారని పేర్కొన్నారు.



వరుసగా నిర్మాణాలు..



అన్న క్యాంటీన్ వద్ద నర్సరీ

ఆయుర్వేద వైద్య సేవలు విస్తృతం

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే : ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా గత వంద రోజుల్లో దేశంలోని అన్ని ప్రాంతాలకు ఆయుర్వేద వైద్య సేవలు చేరువ చేసినట్లు విజయవాడ ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధనా సంస్థ సహాయ సంచాలకుడు (ఇన్‌ఛార్జి) డాక్టర్ బండి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. వైద్య రంగాన్ని కొత్త పుంతలు తొక్కించేందుకు ప్రపంచంలోని వైద్య విశ్వవిద్యాలయాలు, ఆరోగ్య సంస్థలు, దేశాలతో ఒప్పందాలు చేసుకుంటున్నట్లు తెలిపారు. సోమవారం రాజీవ్‌నగర్‌లోని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధనా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి మండలంలో ఆయుష్మాన్ వైద్యశాలను ఏర్పాటు చేసి పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఆయుర్వేదం ద్వారా ఎలాంటి దుష్ఫలితాలు ఉండవని చెప్పారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరికీ చికిత్స ఉందని వివరించారు. ఆయుర్వేదం, యోగా, నేచురోపతి, సిద్ధ, యునాని, హోమియోపతి, సోరారిగ్పా చికిత్సలను ప్రపంచ వ్యాప్తంగా విస్తరించేందుకు భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వశాఖ కృషి చేస్తోందని వివరించారు. డాక్టర్ నోరి రామశాస్త్రి ఆయుర్వేద వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి సుధాకర్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 1,256 శిబిరాల ద్వారా వృద్ధులకు సేవలు అందించామని తెలిపారు. విజయవాడ వరద పీడిత ప్రాంతాల్లో తమ కళాశాల, డాక్టర్ ఆచంట లక్ష్మీపతి ఆయుర్వేద వైద్యశాల వైద్యులు, విద్యార్థులు విస్తృత సేవలు అందించారని వివరించారు. తమ కళాశాలలో ఆల్కహాల్ డి ఎడిక్షన్ సెంటరు ఉందని, దాని ద్వారా మద్యం అలవాటును మాన్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధనా కేంద్రం ఇన్‌ఛార్జి డాక్టర్ ఎ.జె.వి.సాయిప్రసాద్, ఏలూరు ఆయుర్వేద రీజినల్ డైరెక్టర్ డాక్టర్ బి.కల్పన, డాక్టర్ ఆచంట లక్ష్మీపతి ఆయుర్వేద ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ బండి వెంకటేశ్వర్లు. వేదికపై వైద్యులు సాయిప్రసాద్, సాయిసుధాకర్, కల్పన, కృష్ణవేణి

సమాజ శ్రేయస్సుకే రైతు ఉద్యమం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : దేశంలో రైతు ఉద్యమాలన్నీ సమాజ శ్రేయస్సుకేనని మాజీ మంత్రి, ఏపీ రాష్ట్ర రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా కొనసాగిన ఉద్యమంలో కన్నుమూసిన 700 మంది అన్నదాతలకు నష్టపరిహారాన్ని ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేరళ తరహాలో దేశ వ్యాప్తంగా సేద్యం కోసం రైతులు తీసుకున్న అన్ని రుణాలనూ మాఫీ చేసేలా చట్టాన్ని తీసుకురావాలని కేంద్రానికి సూచించారు. బెంగళూరు గాంధీభవన్‌లో సోమవారం ప్రారంభమైన దక్షిణాది రాష్ట్రాల సంయుక్త కిసాన్ మోర్చా నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏపీ రాష్ట్ర సాగునీటి సంఘాలు, వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, వివిధ సంఘాల నాయకులు డి.హరినాథ్, పి.జమలయ్య, చుండూరు రంగారావు పాల్గొన్నారు.

అక్కినేని నటన అజరామరం

గాంధీనగర్, న్యూస్‌టుడే : అక్కినేని నటన అజరామరమని మహానటి సావిత్రి కళాపీఠం అధ్యక్షురాలు పరుచూరి విజయలక్ష్మి అన్నారు. అక్కినేని శతజయంతి మహోత్సవంలో భాగంగా ఆ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి అక్కినేని నాగేశ్వరరావు అని కొనియాడారు. ఆధ్యాత్మికవేత్త వేములహజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ.. తన తొలి సినిమా షూటింగ్ అన్నపూర్ణ స్టూడియోలో జరిగిందని గుర్తు చేసుకున్నారు. ఏఎన్ఆర్ చేతుల మీదుగా రవీంద్ర భారతిలో సత్కారం పొందడం మరువలేనన్నారు. పలువురు కళాకారులను ఘనంగా సత్కరించారు. పలువురు గాయకులు.. అక్కినేని చిత్రాల్లోని పాటలను ఆలపించి అలరించారు. డేవిడ్ రాజు, వీరభద్రరావు, చావా నరసింహారావు, ప్రసూనరామన్ తదితరులు పాల్గొన్నారు.



కళాకారులను సత్కరిస్తున్న విజయలక్ష్మి, గుప్తా, ప్రసూనరామన్ తదితరులు

కార్యసిద్ధి ప్రాప్తిరస్తు..!



బీసెంట్‌రోడ్డు రామాలయం వద్ద ..



గద్దె వెంకట్రామయ్య నగర్‌లో..



మధురానగర్ నేతాజీకాలనీ.. అంకమ్మతల్లి శక్తిపీఠంలో..



కస్తూరిబాయిపేటలోని ముత్యాలమ్మ గుడిలో..



కార్మికపురం దాసాంజనేయ స్వామి ఆలయంలో..



సీతారాంపురం ఇజ్జాడవారి వీధిలో..



విశాలాంధ్ర రోడ్డు చలసాని చౌక్‌లో విశాలాక్షిదేవిగా..

గవర్నర్‌పేట, మధురానగర్, సత్యనారాయణపురం, సీతారాంపురం, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాల్లో 5వ రోజు అమ్మవారు మహా చండీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. రంగు రంగుల విద్యుద్దీపాల ధగధగలతో నగరంలోని పూజా మందిరాలు, ఆలయాలు నూతన శోభను సంతరించుకున్నాయి. భారీ సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.



మధురానగర్ రత్నాగార్డెన్స్‌లోని పూజా మండపం కిటకిట..



శారదాపీఠంలో..



ముత్యాలంపాడులో..



దుర్గాపురంలో ..



సత్యనారాయణపురంలో..



అయోధ్యనగర్‌లో..

సమస్యల పరిష్కారానికి విజ్ఞప్తి

గాంధీనగర్, న్యూస్‌టుడే : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం పాత ప్రభుత్వ ఆస్పత్రిలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కమల మాట్లాడుతూ.. గతంలో తమ సమస్యలను జిల్లా వైద్యాధికారిణి ఎం.సుహాసినితో పాటు ఇతర అధికారుల దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. శుభ్రం చేసే పనులు చేయించరాదని, సచివాలయాల్లో వెల్నెస్ సెంటర్లలో ఉదయం 9గంటల వరకు కూర్చోబెట్టడం, రిజిస్టర్లు పెట్టి సంతకాలు చేయించడం తగదని, సర్వేలు చేయించవద్దని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని పేర్కొన్నారు. వీటిని డీఎంహెచ్‌వోకు వివరించగా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రత్తిపాటి జ్యోతి, శ్రీలక్ష్మి, జి.దయామణి, వెంకటరమణ, సునీత, సుజాత, నాగమణి, తిరుమలేశ్వరి, వనజ తదితరులు పాల్గొన్నారు.

'దురుద్దేశంతోనే పాలస్తీనాపై దాడులు'

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ఒక జాతిని అంతం చేయాలనే దురుద్దేశంతోనే పాలస్తీనాపై దాడి చేసి.. వేలాది మందిని ఇజ్రాయెల్ పొట్టనబెట్టుకుందని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సి.హెచ్.బాబూరావు అన్నారు. అదొక టెర్రరిస్టు దేశమని ఆరోపించారు. 'గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఆపాలి. పాలస్తీనాకు సంఘీభావం' అనే అంశంపై వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం బాలోత్సవ్ భవన్‌లో సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పాలస్తీనాను ఆక్రమించాలనే లక్ష్యంతో ఇజ్రాయెల్ ఇష్టారాజ్యంగా బాంబుల వర్షం కురిపించిందని మండిపడ్డారు. అధికారికంగా 45వేల మంది చనిపోయారని చెబుతున్నారని, వీరిలో 16వేల మంది చిన్నారులేనని ఆవేదన వ్యక్తం చేశారు. అరబ్ దేశాలపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల వెనుక అమెరికా, యూరప్‌లోని కొన్ని సామ్రాజ్యవాద దేశాలు ఉన్నాయని ఆరోపించారు. వారే మారణాయుధాలు సరఫరా చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ దురాగతాలను ఖండించాలని కోరారు. సీపీఐ ఎంఎల్ నాయకుడు జాస్తి కిశోర్‌బాబు మాట్లాడుతూ.. అమెరికా లాంటి దేశాలు స్వలాభం కోసం ఆయుధాలు తయారు చేస్తున్నాయని, యుద్ధాలు చేయిస్తున్నాయని ధ్వజమెత్తారు. ఆయిల్‌పై పట్టు సంపాదిస్తే.. ప్రపంచాన్ని తమ గుప్పెట్లో పెట్టుకోవాలనే ఉద్దేశంతోనే ఇజ్రాయెల్ పేరుతో అమెరికా యుద్ధం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు సలీమ్, రవికాంత్, దోనెపూడి కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాబూరావు

వృద్ధుడి బలవన్మరణం

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే : భార్యాపిల్లలకు దూరంగా ఉంటున్న ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నట్లు నున్న పోలీసులు కేసు నమోదు చేశారు. వాంబేకాలనీకి చెందిన షేక్ వలీ బాషా (60) తాపీ పని చేస్తుంటారు. మనస్పర్థల కారణంగా 25 సంవత్సరాల కిందటే భార్యతో విడిపోయారు. అనంతరం రెండో వివాహం చేసుకున్నారు. భార్యాపిల్లలను సరిగా పట్టించుకోకపోవడంతో.. వారు అతనికి దూరంగా ఉంటున్నారు. వలీ బాషా.. తన తల్లి వద్ద ఉంటున్నారు. అనారోగ్యంతో ఇంటి వద్దే ఉంటున్నారు. ఆదివారం రాత్రి తమ్ముడు అల్లా భక్షుతో మాట్లాడారు. రాత్రి 10 గంటల సమయంలో చూడగా.. ఇంట్లో ఉరేసుకుని కనిపించారు. తల్లి... నున్న పోలీసులకు సమాచారం అందించగా, వారు కేసు నమోదు చేశారు.

బాత్‌రూమ్‌లో జారిపడి బాలుడి మృతి

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే : బాత్‌రూమ్‌లో జారిపడిన బాలుడు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై నున్న పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు.. రాజీవ్‌నగర్‌కు చెందిన కరకట్ల రేవంత్ (16) పోలియో, హిమోఫీలియా వ్యాధులతో బాధపడుతున్నాడు. గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఈ నెల 3న రేవంత్‌ను తండ్రి హరీష్ బాత్‌రూమ్‌కు తీసుకువెళ్లారు. అక్కడ కాలుజారి పడిపోగా.. బాలుడి తల వెనుక గాయమై బొప్పి కట్టింది. 5వ తేదీన రక్తం కారుతుంటే.. చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. నున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

తల్లాడ, న్యూస్‌టుడే: ఆర్టీసీ విజిలెన్స్ అధికారులకు త్రుటిలో ప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి. ఆర్టీసీ బస్సుల్లో పొరుగు రాష్ట్రాలకు మద్యం సరఫరా అవుతుందనే సమాచారంతో ఏపీ విజయవాడకు చెందిన విజిలెన్స్ అధికారులు ఖమ్మం జిల్లా తల్లాడ రింగురోడ్డు కూడలిలో సోమవారం బస్సులను తనిఖీ చేశారు. అనంతరం బొలెరో వాహనంలో కల్లూరు వైపు బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న వాహనం తల్లాడ సమీపంలోని ఎన్టీఆర్ నగర్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొని అదుపుతప్పి పొదల్లోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో వాహనంలో ప్రయాణిస్తున్న ఆర్టీసీ విజిలెన్స్ అధికారులు బి.వెంకటేశ్వర్లు, పి.శ్రీనివాసరావు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వాహనాన్ని ట్రాక్టర్ సాయంతో బయటకు తీశారు.

10న శివరామకృష్ణ క్షేత్రంలో గోపూజ

సత్యనారాయణపురం, న్యూస్‌టుడే : గోమాతను దేశ మాతగా ప్రకటించాలని ఉత్తరాఖండ్‌కు చెందిన జ్యోతిర్మఠ్ పీఠాధిపతి అవిముక్తేశ్వరానంద సరస్వతి తలపెట్టిన యాత్ర ఈ నెల 10వ తేదీన నగరానికి చేరుకుంటుందని బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ వేమూరి ఆనందసూర్య తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలు, గోడపత్రాలను సోమవారం సత్యనారాయణపురంలోని తెదేపా కార్యాలయంలో ఆవిష్కరించారు. స్వామిజీ యాత్రకు స్పందించిన మహారాష్ట్ర ప్రభుత్వం.. గోవును ఆ రాష్ట్రమాతగా ప్రకటించిందన్నారు. ఏపీ కూడా ప్రకటించాలని కోరారు. స్వామిజీ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన సత్యనారాయణపురం శివరామకృష్ణ క్షేత్రంలో గోపూజ నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో తెదేపా 33వ డివిజన్ ఇన్‌ఛార్జి గార్లపాటి విజయకుమార్, సారథి, ధనలక్ష్మి, శంకర్‌సాయి పాల్గొన్నారు.



కరపత్రాలు, గోడ పత్రికలు ఆవిష్కరిస్తున్న ఆనందసూర్య, విజయకుమార్ తదితరులు

వరద బాధితులకు నిత్యావసరాలు

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే : బుడమేరు వరదల్లో నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు వివిధ స్వచ్ఛంద సంస్థలు ముందుకు వస్తున్నాయి. పది రకాల సరకులతో కూడిన కిట్లను దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో జాతీయ కన్వీనర్ గెడ్డం ఝాన్సీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. 15 మురికివాడల్లో ఈ కార్యక్రమం చేపట్టారు. సోమవారం రాజీవ్‌నగర్‌లోని ఒక చర్చిలో నిత్యావసరాలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. బలహీనవర్గాలుండే ప్రాంతాలు భవిష్యత్తులో ముంపునకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సత్య, రోజా, దివ్య తదితరులు పాల్గొన్నారు. ❖ హైదరాబాద్‌కు చెందిన నిర్మాణ్ ఆర్గనైజేషన్ పుచ్చలపల్లి సుందరయ్య పాఠశాల పరిసరాల్లోని వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. బియ్యం, కారం, పసుపు, నూనె, దుప్పట్లు, టవల్స్‌తో కూడిన ఈ కిట్లను విద్యార్థుల తల్లిదండ్రులకు ఇచ్చారు. జిల్లా సైన్సు అధికారి మైనం హుస్సేన్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో దినేష్, మోహన్, చైతన్య, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్‌నగర్ చర్చిలో సరకులు అందిస్తున్న ఝాన్సీ తదితరులు



పాయకాపురంలో మైనం హుస్సేన్, ప్రతినిధులు

శంకరన్ జీవితం ఆదర్శప్రాయం

అరండల్‌పేట (సీతారాంపురం), న్యూస్‌టుడే : పేదల పక్షపాతి ఎస్.ఆర్.శంకరన్ జీవితం ఆదర్శప్రాయమని పలువురు వక్తలు కొనియాడారు. అరండల్‌పేటలోని అంబేడ్కర్ జగ్జీవన్ ఐక్యతా భవనంలో సోమవారం దళిత, ప్రజా సంఘాలు ఘనంగా నివాళులర్పించారు. కుల వివక్ష పోరాట సమితి (కేవీపీఎస్)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ శంకరన్ తమిళనాడు రాష్ట్రం తంజావూరులోని బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారన్నారు. ఐఏఎస్‌గా నంద్యాల సబ్ కలెక్టర్, కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారని చెప్పారు. సాంఘిక సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శిగా.. దళిత, గిరిజనుల అభ్యున్నతికి పలు ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఆ మహోన్నత వ్యక్తి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, సంక్షేమ పథకాలకు ఆయన పేరు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, జిల్లా నాయకుడు జి.నటరాజు, చింతల శ్రీనివాస్, జి.అరుణమ్మ, దళిత స్త్రీ శక్తి సమన్వయకర్త గడ్డం ఝాన్సీ, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుట్టి రాయప్ప, వీరయ్య, అశోక్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న జల్లి విల్సన్, మాల్యాద్రి, సంఘాల ప్రతినిధులు

9 నుంచి ఆహ్వాన కబడ్డీ టోర్నీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: మంగళగిరిలో ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి ఆహ్వానపు స్త్రీ, పురుషుల కబడ్డీ టోర్నీ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కబడ్డీ సంఘం కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ తెలిపారు. రాష్ట్రంలోని అత్యుత్తమ ప్రతిభగల 13 పురుషులు, ఎనిమిది మహిళల జట్లు పాల్గొంటాయని ఆయన పేర్కొన్నారు.

తలచిన ధన్యం.. కొలిచిన పుణ్యం

ఇంద్రకీలాద్రిపై భక్తుల ఆర్జిత సేవలు



రాముడు కంటే.. కృష్ణుడు కంటే.. ప్రపంచంలో సకల దేవతల కంటే గొప్పవారు కనకదుర్గాదేవి. అందరికంటే గొప్పవారు.. లోకమాత.. జగన్మాత.. ఆమెకు మించిన భగవత్ శక్తి మరొకటి లేదు. ఏ దేవుడి శక్తినైనా సందేహించవచ్చు కానీ.. జగన్మాత శక్తి మాత్రం అనంతమైనది. ఆమె ముందు కృష్ణ శక్తి కూడా పని చేయదు... అంతటి శక్తిమంతురాలైన కనకదుర్గమ్మను అర్చించాలని ప్రతి భక్తుడూ కోరుకుంటాడు. అందుకే ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి నిత్యం ఇంద్రకీలాద్రికి తరలివస్తుంటారు. అమ్మవారిని దర్శించుకోవడంతోపాటు తమ శక్తికొద్దీ ఆర్జిత సేవల్లో పాల్గొంటూ ప్రత్యేక పూజలు చేస్తున్నారు. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకి వేదవేదాంత వనవాసిని అయిన జగన్మాతకు నిత్యం త్రికాలార్చనలు, ఆర్జిత సేవలను ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహిస్తారు. సాధారణ రోజుల్లో ఆర్జిత సేవలు సుప్రభాత సేవ, ఖడ్గమాలార్చన, వస్త్రాలంకృత సేవ, శాంతి కల్యాణం, సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం, రాహుకేతు పూజ, లక్షకుంకుమార్చన, చండీహోమం, శ్రీచక్రనవావరణార్చన, రుద్రాభిషేకం పూజలకు భక్తులు టిక్కెట్ రుసుము చెల్లించి చేయించుకుంటారు. దసరా వేడుకల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆర్జిత సేవల్లో భాగస్వామ్యాన్ని కుదించారు. దుర్గామల్లేశ్వర స్వామి వార్లకు మాత్రం భక్తులతో సంబంధం లేకుండా ఆర్జిత సేవలను అర్చకులు నిర్వహిస్తారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కుంకుమార్చన, చండీహోమం, శ్రీచక్ర నవావరణార్చన, ఖడ్గమాలార్చన పూజలకు మాత్రమే ఉభయ దాతలను అనుమతిస్తున్నారు.

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

అత్యంత ప్రీతిపాత్రం కుంకుమార్చన

జగన్మాత దుర్గమ్మకు అత్యంత ప్రీతిపాత్రమైనది కుంకుమార్చన. శ్రీచక్ర సహితంగా ఏర్పాటు చేసిన అమ్మవారికి ఉభయదాతలతో గోత్ర నామాలతో పదిమంది అర్చకులు లలిత సహస్రనామాలతో కుంకుమార్చన చేయిస్తారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు 10 నుంచి 12 గంటల వరకు కుంకుమార్చనను ఇంద్రకీలాద్రిపై మల్లికార్జున మహామండపం 6వ అంతస్తులో నిర్వహిస్తారు. ఇద్దరు పాల్గొనవచ్చు. ఈ సేవ టిక్కెట్ రుసుం రూ.3వేలుగా నిర్ణయించారు. మూలా నక్షత్రం రోజు రూ.5 వేలు రుసుం చెల్లించాల్సి ఉంటుంది.

విశిష్టత



ఈ సేవతో మహిళలకు సౌభాగ్యం సిద్ధిస్తుందని విశ్వాసం.

విశిష్టత



సర్వ బాధల నుంచి విముక్తిని చండీమాత ప్రసాదిస్తుందని నమ్మకం. లోక కల్యాణం కోసం ఈ హోమం నిర్వహిస్తారు.

లోక కల్యాణానికి చండీహోమం

దుర్గామల్లేశ్వర స్వామి వారి క్షేత్రంలో నిత్యం చండీ హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. దసరా ఉత్సవాల్లో కుంకుమార్చన తరువాత ఉభయదాతలు అత్యంత ఇష్టపడే ఆర్జిత సేవ చండీహోమం. సప్తశతి శ్లోక మంత్రాలతో ఈ హోమాన్ని రుత్వికులు నిర్వహిస్తారు. లోక కల్యాణం కోసం నిత్యం జరిగే విధంగా దీనిని దేవస్థానం ఏర్పాటు చేసింది. దసరా ఉత్సవాల్లో చండీహోమం టిక్కెట్ రుసుము రూ.4 వేలుగా నిర్ణయించారు. ఇంద్రకీలాద్రిపై యాగశాలలో ఉభయ దాతల సమక్షంలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు రుత్వికులు జరుపుతారు.

విశిష్టత



ఈ అర్చన ద్వారా ఎటువంటి పరిస్థితులైనా ఎదుర్కొనే శక్తి లభిస్తుందని భక్తుల విశ్వాసం.

శోభాయమానంగా ఖడ్గమాలార్చన

దుర్గమ్మ సన్నిధిలో నిర్వహించే ఖడ్గమాలార్చనకు ప్రత్యేకత ఉంది. మూలవిరాట్‌కు అభిముఖంగా మూర్తుని వేసే ఖడ్గమాలార్చనను దసరా ఉత్సవాల్లో మాత్రం భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మల్లికార్జున మహామండపం ఆరో అంతస్తుకు మార్చారు. సాధారణ రోజుల్లో ఖడ్గమాలార్చన టిక్కెట్టు పరిమితం కావడంతో భక్తులు నెల రోజుల వేచి ఉండాల్సి వస్తుంది. ప్రస్తుతం మల్లికార్జున మహామండపంలో ఉదయం 5 నుంచి 6 గంటల మధ్య ఈ సేవ భక్తులకు లభిస్తుంది. టిక్కెట్ రుసుం రూ.5,116గా నిర్ణయించారు.

నిత్యం త్రికాలార్చనలు

ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్లకు నిత్యం త్రికాలార్చనలను వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ అర్చకులు నిర్వహిస్తారు. సుప్రభాత సేవ అనంతరం గణపతి పూజతో నిత్యం ప్రాతఃకాలార్చన చేస్తారు. శ్రీసూక్త విధాన సహితంగా షోడశోపచార ఆరాధన నిర్వహిస్తారు. శ్రీలలిత సహస్రనామాలతో లోకాలు ఏలే తల్లిని అర్చిస్తారు. బాలభోగంగా దద్దోజనాన్ని నివేదిస్తారు. ప్రాతఃకాలార్చన అనంతరం ఉదయం 5 గంటలకు భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు.

ఆదిశంకరులు ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి..



విశిష్టత

తొమ్మిది ఆవరణలలో దేవతలు కొలువుతీరిన శ్రీచక్రాన్ని పూజించడంతో అష్టైశ్వర్యాలు, సమస్త శుభాలు కలుగుతాయన్నది భక్తుల విశ్వాసం.

దుర్గమ్మ సన్నిధిలో ఆది శంకరాచార్యులు ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి నిత్యార్చన జరుగుతుంది. దసరా ఉత్సవాల్లో మల్లికార్జున మహామండపం ఆరో అంతస్తులో శ్రీచక్రనవావరణార్చన సేవను ఏర్పాటు చేశారు. సృష్టి, స్థితి, లయకారిణి అయిన త్రిశక్తి స్వరూపిణికి మహిమాన్వితమైన శ్రీచక్రంతో అర్చన చేస్తారు. దసరా ఉత్సవాల్లో ఈ సేవ టిక్కెట్ రుసుం రూ.3వేలుగా నిర్ణయించారు. మల్లికార్జున మహామండపం ఆరో అంతస్తులో ఉదయం 8 నుంచి 12 గంటల వరకు భక్తులకు ఈ సేవ అందుబాటులో ఉంటుంది. ఆర్జిత సేవల్లో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్లో అమ్మవారి దర్శనాన్ని దేవస్థానం సిబ్బంది చేయించి ప్రసాదాలు అందజేస్తారు.



పంచహారతులతో సాయంకాలార్చన

అమ్మవారికి సాయంకాలం 5.30 గంటలకు శ్రీసూక్త విధానంతో షోడశోపచార పూజలు చేసి, సంకల్పం చేస్తారు. యాలుకలు, కిస్మిస్, పండ్లు, సుగంధ ద్రవ్యాలతో కూడిన క్షీరాన్నాన్ని అమ్మవారికి నివేదిస్తారు. అమ్మవారికి వేదపండితుల మంత్రోచ్చరణ నడుమ ఓంకార, నాగ, కుంభ, పంచ, నక్షత్ర హారతులను సమర్పిస్తారు. పంచహారతులతో పాటు సింహ హారతిని కూడా ఇచ్చి వేదస్వస్తి నిర్వహిస్తారు. హారతుల సమయంలో అన్ని దర్శనాలను నిలిపివేస్తారు.

మధ్యాహ్న కాలార్చన మహానైవేద్యం

దుర్గగుడి ఆలయ ప్రాంగణాన్ని శుద్ధి చేసిన తర్వాత మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ అర్చకులు అమ్మవారికి అష్టోత్తర, శతనామార్చన చేసి నైవేద్యాన్ని సమర్పిస్తారు. పరిచారకులు సంప్రదాయ బద్ధంగా దేవస్థానం వంటశాల నుంచి తయారు చేసిన గంగాళాలతో ప్రధాన ఆలయంతో పాటు ఉపాలయాల్లోని దేవతామూర్తుల ఎదుట నివేదిస్తారు. భక్ష్య, చోష్య, లేహ్య, సూప శాకదాది సహితంగా సమర్పించే నైవేద్యాన్ని మహానైవేద్యంగా చెబుతారు.

ఐదో రోజు దసరా ఆదాయం రూ.48.31 లక్షలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దసరా వేడుకల్లో భాగంగా ఐదో రోజు సోమవారం వివిధ సేవలు, దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.48.31 లక్షల ఆదాయం వచ్చింది. రూ.500, రూ.300, రూ.100 దర్శనం టిక్కెట్ల రూ.19.41లక్షలు, రూ.5.20లక్షలు, రూ.3.81 లక్షల ఆదాయం వచ్చింది. లడ్డూ ప్రసాదాల విక్రయంతో రూ.16.25 లక్షలు, తలనీలాల టోకెన్ల ద్వారా రూ.93,600 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

దుర్గమ్మ సన్నిధిలో.. ధర్మ ప్రచార యజ్ఞం

2003లో చంద్రబాబు సూచనలతోనే ఆరంభం ● రెండు దశాబ్దాలుగా ‘శ్రీకనకదుర్గప్రభ’ వెలుగు



శ్రీకనకదుర్గప్రభ పత్రిక

ఈనాడు, అమరావతి: విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం కేంద్రంగా గత రెండు దశాబ్దాలుగా ధర్మ ప్రచార యజ్ఞం కొనసాగుతోంది. దుర్గమ్మ సన్నిధి నుంచి ధర్మ ప్రచారం చేయాలనే ఉద్దేశంతో 2003లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలతో శ్రీకనకదుర్గప్రభ మాసపత్రిక ఆరంభమైంది. భవిష్యత్తు తరాలకు పురాణాలు, ఇతిహాసాల గొప్పతనాన్ని తెలియజేయాలనే ప్రధాన ఉద్దేశంతోనే దుర్గమ్మకు సొంత పత్రికను ప్రారంభించారు. కనకదుర్గమ్మ వైభవం, మల్లేశ్వరస్వామి మహిమలు, రామాయణం, భాగవతం, భారతాల సారాంశాలను నేటి తరానికి అందిస్తోంది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2003లో అప్పటి దేవాదాయశాఖ మంత్రి, ఉన్నతాధికారులు, ఆలయ కార్య నిర్వహణ అధికారితో సమీక్ష సమావేశం నిర్వహించి.. విజయవాడ దుర్గమ్మ సన్నిధి నుంచి ధర్మ ప్రచార మాస పత్రిక ప్రారంభించాలని నిర్ణయించారు. 2003 ఉగాది నుంచి పత్రికను ఆరంభించారు. పురాణ, ఇతిహాసాలతోపాటు ప్రతినెలలో పండగలు, వ్రతాలు, పూజల వివరాలతో పాటు అనేక విషయాలను భక్తులకు తెలియజేస్తోంది. గత 21 ఏళ్లుగా శ్రీకనకదుర్గప్రభ మాసపత్రిక ద్వారా దుర్గగుడి కేంద్రంగా ధర్మ ప్రచారం నిర్విరామంగా కొనసాగుతోంది.

అత్యంత నాణ్యతగా లడ్డూ ప్రసాదం



లడ్డూ పోటులో ప్రసాదం తయారీని పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : అత్యంత నాణ్యతగా దుర్గగుడి లడ్డూ ప్రసాదం తయారు చేయాలని జిల్లా కలెక్టర్ సృజన ఆలయ అధికారులకు సూచించారు. మల్లికార్జునపేటలోని ప్రసాదాల తయారీ కేంద్రం(లడ్డూ పోటు)ను సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. లడ్డూ, పులిహోర తయారీకి వినియోగించే దినుసులను పరిశీలించారు. ప్రసాదాల నాణ్యత విషయంలో రాజీ పడవద్దని అధికారులకు సూచించారు. మూలా నక్షత్రం రోజుకు రెండున్నర లక్షల లడ్డూలు సిద్ధం చేయాలన్నారు. సరకుల నాణ్యత పరీక్షించేందుకు నమూనాలను ఎప్పటికప్పుడు సేకరించి ల్యాబ్‌కు పంపాలన్నారు. ఏమాత్రం అనుమానం వచ్చినా సరకులను తిప్పి పంపి, నాణ్యమైనవి తీసుకువచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కనకదుర్గానగర్‌తోపాటు భవానీ ఘాట్ వద్ద కూడా ప్రసాదాలు విక్రయిస్తారని భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మూలా నక్షత్రం రోజు 2.50 లక్షల మంది భక్తులు దర్శించుకునే అవకాశం ఉన్నందున క్యూలైన్లు, దర్శనం, ప్రసాదాలు, అన్నప్రసాద పంపిణీ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఈ రమాదేవి, ఏఈవో చంద్రశేఖర్, సూపరింటెండెంట్ హేమదుర్గ పాల్గొన్నారు.

నేటి అలంకారం

8-10-2024, మంగళవారం

శ్రీ మహాలక్ష్మీ దేవి



సరసిజనిలయే సరోజహస్తే
ధవళతరాంశుక గంధమాల్యశోభే
భగవతి హరివల్లభే మనోజ్ఞే
త్రిభువన భూతికరి ప్రసీదమహ్యామ్॥

సిరిసంపదలు, సౌభాగ్యం, సంతానం, ధైర్యసాహసాలు, విజయానికి అధిష్ఠాన దేవత మహాలక్ష్మి. సకల లోకాలకు ఐశ్వర్య ప్రదాయిని. ఇరువైపులా గజరాజులు సేవిస్తుండగా, రెండు చేతులతో కమలాలు ధరించి, అభయ, వరదముద్రలతో క్షీరాబ్ధి పుత్రికయై ఈ తల్లి భక్తులకు దర్శనమిస్తారు. డోలాసురుడనే రాక్షసుడిని సంహరించి, లోకాలకు శాంతి ప్రసాదించింది. త్రిపురాత్రయంలో ఈమె మధ్యశక్తి. ‘యా దేవీ సర్వ భూతేషు లక్ష్మీరూపేణ సంస్థితా’ - సకల జీవుల్లో లక్ష్మీరూపంలో ఈ తల్లి కొలువై ఉంటుందని చండీసప్తశతి చెబుతోంది. రుగ్వేదం పదో మండలంలోని శ్రీసూక్తం ఈ తల్లి వైభవాన్ని కీర్తిస్తుంది. అగ్ని, మత్స్య పురాణాలు ఈమె ఆకృతి, శిల్పనిర్మాణ నియమాలు వెల్లడిస్తాయి. అష్ట లక్ష్ములకు ఈమె అధిష్ఠాత్రి. ఈ తల్లి ఉపాసన ద్వారా లౌకిక సంపదలతో పాటు అలౌకికమైన మోక్ష సంపద కూడా లభిస్తుంది. ఈమె శ్రీఘ్ర ఫలదాయిని. శ్రీసూక్త విధానంగా ఎర్రని పుష్పాలతో, లక్ష్మీ అష్టోత్తరంతో ఈమెను అర్చించాలి. అమ్మకు ప్రీతిగా సువాసినీ పూజ చేయాలి. లక్ష్మీస్తోత్రాలు పఠించాలి. ఓం శ్రీం హ్రీం క్లీం మహాలక్ష్మై స్వాహా అనే మంత్రాన్ని జపించాలి.

బందరులో ‘కోల్‌కతా’ ఆచారం

ప్రత్యేకత చాటుతున్న శక్తి పటాల ఊరేగింపు



శక్తిపటాల ఊరేగింపులో భక్తులు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: మచిలీపట్నం దసరా శక్తిపటాల ఊరేగింపునకు పెట్టింది పేరు. కోల్‌కతాలో మాత్రమే కనిపించే ఈ ఆచారాన్ని 1879 సంవత్సరంలో నగరానికి చెందిన మాజీ సైనికుడు దాదా ఇక్కడ పరిచయం చేశారు. తొలుత ఆయన కాళికామాత చిత్రపటాన్ని ఈడేపల్లిలో ప్రతిష్ఠించి పూజలు చేయడంతోపాటు శరన్నవరాత్రి పర్వ దినాల్లో శక్తిపటాల ప్రదర్శన మొదలుపెట్టారు. అప్పటి నుంచి ఏటా ఈ ఉత్సవాలు కొనసాగుతున్నాయి.


ఎలా నిర్వహిస్తారంటే..



శక్తిపటాలు

మనిషికి శక్తి వేషం వేసి వెదురు బద్దలతో చేసిన దుర్గామాత శక్తి పటానికి కాగితాలు అంటించి వీపునకు కడతారు. ఆ వ్యక్తి పురవీధులలో ఊరేగుతుండగా డప్పు మోతలతో నృత్యం చేస్తూ పలువురు భక్తులు అనుసరిస్తుంటారు. శక్తిపటం కట్టుకున్న వ్యక్తిని దుర్గామాత ఆవహిస్తుందని భక్తుల నమ్మకం. నల్లని దుస్తులతో ఒక చేతిలో చురకత్తి, రెండో చేతిలో 50 కిలోల బరువున ఆరడగుల శక్తిపటాన్ని భుజానకెత్తుకుని నిర్వహించే ప్రదర్శన నేత్రపర్వంగా సాగుతుంది. పటాన్ని ఎత్తుకునే వ్యక్తి తెల్లవారుజామున రుద్రభూమిలో పూజలు చేసి ఉపవాస దీక్ష స్వీకరిస్తారు.

ముఖానికి కరాళం..



ముఖానికి కాళికా మాత ముఖచిత్రాన్ని కరాళంగా ధరిస్తారు. దీని వల్ల శక్తిపటాన్ని ఎత్తుకునే వ్యక్తికి సరిగా గాలి అందదు. అందుకే పక్కన కొంత మంది విసినకర్రలతో విసురుతూ సహాయ సహకారాలు అందిస్తారు. భక్తులు వృత్తి రీత్యా ఎక్కడున్నా సరే పండగకు పట్టణానికి వచ్చి శక్తిపటాలతో మొక్కుబడులు చెల్లించుకుంటారు. ఇలా చేస్తే వారి కోర్కెలు తీరతాయని విశ్వాసం. విజయదశమి రోజు నాటి రాత్రి కోనేరు సెంటర్‌లో నిర్వహించే భారీ ప్రదర్శనలో ఉత్సవాలకు ముగింపు పలుకుతారు.

కేశఖండనకు 10వేల టిక్కెట్ల విక్రయాలు



కేశఖండన శాలలో మొక్కు చెల్లించుకుంటున్న భక్తురాలు

కృష్ణలంక, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మొక్కుల చెల్లింపు నిమిత్తం కృష్ణవేణి, భవాని, పున్నమీ ఘాట్లలో కేశఖండన శాలలు ఏర్పాటు చేశారు. కేశఖండన విధుల నిమిత్తం కనకదుర్గమ్మ ఆలయంతో పాటు రాష్ట్రంలోని ఇతర దేవాలయాలు, పత్రికా ప్రకటనల ద్వారా సుమారు 500 మందిని ఏర్పాటు చేశారు. మూడు కేశఖండన శాలలను ఏర్పాటు చేసినప్పటికీ ఒక్క కృష్ణవేణిఘాట్ వద్దే విధుల నిమిత్తం సుమారు 270 మందిని కేటాయించడం జరిగింది. విధుల నిమిత్తం వచ్చిన వారికి కేశఖండనశాల వద్దే అల్పాహారం, మధ్యాహ్నం, భోజన వసతులు సమకూర్చారు. విధుల నిమిత్తం వచ్చిన వారికి టికెన్‌కు రూ.40, పత్రికా ప్రకటన ద్వారా వచ్చిన వారికి టోకెన్ రూ.25లు చెల్లిస్తున్నారు. ఉత్సవాలు మొదలైన 3వ తేదీ నుంచి సోమవారం వరకు మూడు కేశఖండనశాలల్లోనూ కేశఖండన నిమిత్తం సుమారు 10 వేల టోకెన్లు విక్రయించినట్లు అధికారులు వెల్లడించారు. మూలా నక్షత్రం ముగిసిన అనంతరం ఆయా ప్రాంతాల నుంచి వచ్చే భవానీ దీక్షాధారుల తాకిడి మొదలవుతుందని అధికారులు భావిస్తున్నారు.

ఎంత పెద్ద బ్రాస్‌లెట్టో..

విలువ.. రూ. కోటికి పైమాటే



ఈయన పేరు రవి. చిత్తూరు జిల్లా నుంచి దసరా సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి వచ్చారు. 1.300 కిలోల బంగారంతో చేసిన బ్రాస్‌లెట్ చేతికి అలంకరించుకున్నారు. దీని విలువ సుమారు రూ. కోటి పైమాటేనని ఆయన చెబుతున్నారు. ఈ బ్రాస్‌లెట్‌ను భక్తులు ఆసక్తిగా తిలకించారు.

- ఈనాడు, అమరావతి

శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం సారె సమర్పణ



పట్టువస్త్రాలు, సారె తీసుకువస్తున్న శ్రీ కాళహస్తీశ్వర దేవస్థానం ఈవో చంద్రశేఖర్ అజాద్, ప్రతినిధుల బృందం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దసరా మహోత్సవాలను పురస్కరించుకొని ఇంద్రకీలాద్రిపై మహాచండీదేవి అలంకారంలో ఉన్న దుర్గమ్మకు శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం తరపున ఈవో చంద్రశేఖర్ అజాద్, ప్రతినిధుల బృందం పట్టువస్త్రాలు, సారెను సోమవారం సమర్పించారు. సారెను దేవస్థానం డిప్యూటీ ఈవో రత్నంరాజు, ఫెస్టివల్ ఆఫీసర్ మూర్తి స్వీకరించి అర్చకులకు అందజేశారు.

సౌకర్యాలు సరే.. పారిశుద్ధ్యం సంగతేంటి?



చెల్లాచెదురుగా మంచినీటి ప్యాకెట్లు



అదే ప్రదేశంలో కవర్లలో చుట్టి పడేసిన ప్లేట్లు

కృష్ణలంక, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల్లో భాగంగా భక్తుల దాహార్తి తీర్చేందుకు కృష్ణవేణిఘాట్ వద్ద నగర పాలక సంస్థ మంచి నీటి ప్యాకెట్ల స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేసింది. ఇక్కడి నుంచే వీటిని నిర్దేశిత పాయింట్లకు తరలిస్తున్నారు. లోడింగ్.. అన్‌లోడింగ్ తదితర పనుల నిమిత్తం పెద్ద మొత్తంలో ఇక్కడ సిబ్బందిని కేటాయించారు. సిబ్బంది టిఫిన్లు, భోజనాలు ముగించుకుని తిన్న ప్లేట్లను ఇక్కడే వేస్తుండడంతో పారిశుద్ధ్య సమస్య తలెత్తింది. భారీగా మంచినీటి ప్యాకెట్లను ఇక్కడే బస్తాల్లో నిల్వ ఉంచడం..ఇక్కడి వారు తాగేందుకు అవసరమైన సందర్భంలో బస్తాల నుంచి ప్యాకెట్లను తీసుకుని నిర్లక్ష్యంగా వదిలివేయడం తదితర కారణాలుగా ప్యాకెట్లన్నీ చెల్లాచెదురై వృథా అయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అధికారులు వీటిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

పేరుకే ఉచితం.. వసూళ్లు మామూలే..



ఉచితమంటూ ఏర్పాటు చేసిన బ్యానర్



నగదు మొత్తాన్ని తీసుకుంటున్న సిబ్బంది

కృష్ణలంక, న్యూస్‌టుడే: దసరా వేడుకలను పురస్కరించుకుని దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం ఆయా పాయింట్లలో ఉచిత పాదరక్షలు, లగేజీని భద్రపరిచే కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇక్కడి సిబ్బంది ఉచితం మాటున వసూళ్లకు పాల్పడుతుండడం భక్తులకు ఆశ్చర్యం కలిగిస్తోంది. కృష్ణవేణిఘాట్ పరిసరాల్లో నగర పాలక సంస్థ ఉచిత పాదరక్షలు, లగేజీని భద్రపరిచే కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. సామగ్రిని ఉంచే నిమిత్తం వచ్చే వారికి టోకెన్లు అందిస్తున్న అక్కడి సిబ్బంది తిరిగెళ్లే క్రమంలో వారి నుంచి బ్యాగుకు రూ.20 చొప్పున వసూలు చేస్తున్నారు. సేవలు ఉచితమని ప్రశ్నించిన వారిని ఇక్కడ ఖాళీ లేదంటూ పంపించి వేస్తున్నట్లు భక్తులు చెబుతున్నారు. పర్యవేక్షణ లోపం కారణంగానే వసూళ్ల పర్వం కొనసాగుతున్నట్లు చెబుతున్న భక్తులు మిగిలిన రోజుల్లోనైనా పటిష్ఠంగా వ్యవహరించి సక్రమంగా సేవలందించేలా చర్యలు చేపట్టాల్సిందిగా కోరుతున్నారు.

తప్పని తిప్పలు..!



బస్సు దిగి రాలేక



చంటి బిడ్డలను బస్సు ఎక్కిస్తూ..

దసరా సందర్భంగా దుర్గగుడి దేవస్థానం కొండపైకి తిప్పుతున్న ఉచిత బస్సు సౌకర్యం సరిపోక భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఉచిత బస్సు రాగానే వందలాది మంది భక్తులు ఒక్కసారిగా బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్నారు. దీంతో చంటి పిల్లలు, వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. రానున్న రోజుల్లో రద్దీ పెరుగుతుందని, మరిన్ని బస్సులు ఏర్పాటుచేస్తే ఇబ్బంది లేకుండా ఉంటుందని భక్తులు పేర్కొంటున్నారు.

- ఈనాడు, అమరావతి



మూడు క్యూలైన్లలోనూ భక్తులను ముందుకు లాగుతున్న పోలీసు, భద్రతా సిబ్బంది



అమ్మవారి ముందు నిలబడి కళ్లు మూసుకుని ప్రార్థిస్తున్న భక్తుడిని ముందుకు తోస్తూ



అన్నిగంటలు క్యూలైన్‌లో నిలబడి వస్తే లాగి పాడేస్తున్నారని పోలీసులతో భక్తుడి వాగ్వాదం

ఇటు భక్తి.. అటు బాధ్యత

దసరా శరన్నవరాత్రులలో ఒక్క రోజైనా దుర్గమ్మను దర్శించుకోవాలని ఇతర రాష్ట్రాల నుంచి, జిల్లాల నుంచి వ్యయ, ప్రయాసలకు ఓర్చి భక్తులు తరలివస్తున్నారు. గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి, దర్శనం కోసం రాగా.. కనులారా దర్శించుకోనివ్వకుండా పోలీసులు, భద్రతా సిబ్బంది ముందుకు లాగేస్తున్నారు అని భక్తుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు దాదాపు 60వేలకు పైగా భక్తులు నిత్యం అమ్మను దర్శించుకునేందుకు వస్తుండగా, వారికి దర్శనం త్వరగా జరగాలంటే ప్రతీక్షణం విలువైనదే. భక్తులు దుర్మమ్మ అలంకారాన్ని చూడకుండా కళ్లుమూసుకుని ప్రార్థిస్తున్నారని.. వారివల్ల సమయం వృథా అవుతుందని భద్రతా సిబ్బంది పేర్కొంటున్నారు. వెనుక వచ్చే భక్తులకు దర్శనం జరగాలని తప్పడం లేదంటున్నారు.

- ఈనాడు, అమరావతి

భక్తుల సంఖ్యకు అనుగుణంగా భద్రతా ఏర్పాట్లు



కమాండ్ కంట్రోల్ రూమ్‌లో చర్చిస్తున్న సీపీ రాజశేఖర్ బాబు, శాంతి భద్రతల ఐజీ శ్రీకాంత్

విద్యాధరపురం: దసరా వేడుకల్లో భాగంగా మూలానక్షత్రం రోజు భక్తులు అధిక సంఖ్యలో దుర్గమ్మ దర్శనానికి తరలి రానుండటతో భద్రతా ఏర్పాట్లను కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీపీ రాజశేఖర్ బాబు, శాంతి భద్రతల ఐజీ శ్రీకాంత్ సోమవారం సమీక్షించారు. భక్తుల వాహనాలు ఎక్కడ నిలుపుతున్నారు... క్యూలైన్లోకి చేరే విధానం, ఘాట్ల వద్ద పరిస్థితి, ఘాట్ రోడ్డులో ఎదురవుతున్న ఇబ్బందులు, దర్శనానంతరం మల్లేశ్వరాలయ మెట్లపై నుంచి కనకదుర్గానగర్‌లోని ప్రసాదాల కౌంటర్లు, అన్నప్రసాద స్వీకరణకు వెళ్లే పరిస్థితులను కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి వారు పర్యవేక్షించారు. మూలానక్షత్రం రోజున భక్తులు వచ్చే సంఖ్యకు అనుగుణంగా భద్రతా ఏర్పాట్లు, క్యూలైన్ల నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో దుర్గగుడి ఈవో రామారావు, డీసీపీ గౌతమి షాలి, ఏడీసీపీ, ఏసీపీలు పాల్గొన్నారు.